Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 337 మేడ్చల్ మల్కాజ్‌గిరి 26 డిసెంబర్ 2023 మంగళవారం పేజీలు : 4

## దేశంలో ఐదేళ్లలో 140 ప్రైవేట్ యూనివర్సిటీలు

న్యూఢిల్లీ : దేశంలో గడిచిన ఐదేళ్ల కాలంలో 140 ప్రైవేట్ విశ్వ విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. అత్యధికంగా గుజరాత్‌లో 28 యూనివర్సిటీలు ఏర్పాటు కాగా.. మహారాష్ట్రలో 15, మధ్యప్రదేశ్ లో 14, కర్ణాటకలో 10 యూనివర్సిటీలు ఏర్పాటైనట్లు కేంద్ర వి ద్యాశాఖ తెలిపింది. అలాగే ఛత్తీసగఢ్‌లో ఏడు, ఝూరండ్, రాజస్థాన్‌లలో ఆరు, తెలంగాణ, ఒడిశా, బిహార్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఐదు, ఆంధ్రప్రదేశ్, హరియాణా, మణిపూర్, తమిళనాడు, సిక్కిం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో నాలుగు చొప్పున కొత్త యూనివర్సిటీలు ఏర్పాటయ్యాయి. ఈ యూనివర్సిటీలన్నీ యూజీసీ చట్టంలోని సెక్షన్ 2(ఎఫ్) ప్రకారం ఏర్పాటయ్యాయి. ఇవి సాధారణ డిగ్రీలను సొంతంగా ప్రదానం చేయొచ్చు. కానీ ప్రొఫెషనల్, మెడికల్ డిగ్రీలు మాత్రం సంబంధిత టెక్నికల్, మెడికల్ బోర్డులే అందజేస్తాయి.

# సబ్సిడీ సిలిండర్‌పై



## కీలక నిర్ణయం దిశగా...!

## హామీల అమలుకు చకచకా అడుగులు!!

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలు పై కసరత్తు చేస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వీటిలో రెండు పాక్షికంగా అమలు ప్రారంభించింది. మిగిలిన వాటిలో రూ 500 గ్యాస్ సిలిండర్ పంపిణీ పథకం పైక కదలిక వచ్చింది. దీని పైన పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రభుత్వానికి అమలు పై ప్రతిపాదనలు అందించారు. ఇందులో కీలక సూచనలు చేసారు.

**మరో పథకం అమలు :** మహిళలకు నాడు ఇచ్చిన మహాలక్ష్మీ పథంలో కీలక మైన సబ్సిడీ పైన గ్యాస్ సిలిండర్లు ఇవ్వటం పైన ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. తాజాగా అధికారులు రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్నవారినే ఈ పథకంలో లబ్దిదారులుగా ఎంపిక చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. సిలిండర్లు దుర్వినియోగం కాకుండా లబ్దిదారుల బయోమెట్రిక్ తీసుకోవాలనే నిబంధన ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ నెల 7న కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. వంద రోజుల్లోగా హామీలు అమలు చేయాల్సి ఉంది. రూ 500 గ్యాస్ సబ్సిడీ పథకానికి రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకొనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రేషన్ కార్డులతో నిమిత్తం లేకుండా లబ్దిదారులను ఎంపిక చేయాలనే ప్రతిపాదన ఉన్నా..అది మరింత ఆలస్యం అవుతుందని భావిస్తున్నారు.

**అధికారుల సూచనలు :** తెలంగాణలో ప్రస్తుతం 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కాగా, రేషన్ కార్డుల సంఖ్య 89.98 లక్షలుగా ఉంది. గివ్ ఇట్ అప్ లో భాగంగా 4.2 లక్షల మంది రాయితీని వదులుకున్నారు. వీరిని మినహాయిస్తే 85.79 లక్షల మంది లబ్దిదారులు ఉంటారు. రేషన్ కార్డు డేటాబేస్ తో మ్యాపింగ్ అయిన గ్యాస్ కనెక్షన్ల సంఖ్య 63.6 లక్షలుగా ఉంది. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లకు రూ 340 రాయితీ అందుతోంది.

మొత్తం కనెక్షన్లలో ఇవి 11. 58 లక్షలు ఉన్నాయి. రాయితీ సిలిండర్లను సంవత్సరానికి ఆరు లేక 12 ఇవ్వాలా...అనే విషయంలోనూ స్పష్టత రావాల్సి ఉంది. ఇందు కోసం అర్హుల కుటుంబంలోని సభ్యుల సంఖ్య..గత ఏడాది వాడిన సిలిండర్ల సంఖ్య..వంటి అంశాలను పరిగణలోకి తీసుకొనే అవకాశం కనిపిస్తోంది.

**సీఎం రేవంత్ నిర్ణయం :** రాష్ట్రంలో ప్రతీ నెలా సిలిండర్ పొందుతున్న వారి సంఖ్య 44 శాతం మంది మాత్రమే ఉన్నారు. కొత్త కార్డులు పొందేవారికీ ఈ పథకం అమలు చేస్తారని చెబుతున్నారు.

కొత్త గ్యాస్ కనెక్షన్లను పరిగణలోకి తీసుకోవద్దని అధికారులు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో..ఈ నెల 28వ తేద నుంచి ఈ పథకం ప్రారంభించాలని తొలుత నిర్ణయించారు. ఇప్పటి వరకు విధి విధానాలు ఖరారు కాకపోవటంతో ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనేది ఈ రోజు జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

## లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం కావాలి : కేటీఆర్

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం కావాలని, అసెంబ్లీల వారీగా భేటీలు ఏర్పాటు చేసుకోవాలని పార్టీ నేతలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ నేతలతో సోమవారం కేటీఆర్ సమావేశమయ్యారు. జనవరి 26వ తేదీలోగా సమావేశాలు పూర్తి చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమితో కుంగిపోవద్దని, పరాజయం



చెందిన బీఆర్ఎస్ అభ్యర్థులే నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లని, వారు ఆయా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని కేటీఆర్ స్పష్టం చేశారు. సమీక్ష అనంతరం చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. తనను చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయమని కేటీఆర్ చెప్పారు. గెలుపే లక్ష్యంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిన స్థానాలపై ప్రత్యేక దృష్టి పెడుతాం అని రంజిత్ రెడ్డి పేర్కొన్నారు.

# ఆ నిధులు ఇవ్వాలా.. వద్దా?

## దళితబంధు మంజూరుపై ఎస్సీ కార్పొరేషన్ తర్జనభర్జన

హైదరాబాద్: దళితబంధు పెండింగ్ చెల్లింపులపై రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల ఆర్థిక సహకార సంస్థ తర్జనభర్జన పడుతోంది. దళితబంధు పథకం రెండో విడతలో భాగంగా ఎంపికైన పలువురు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో ఆర్థిక సాయం చేయలేదు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో తీవ్ర జాప్యం జరగడం... తీరా అరకొర ఈగా అర్హులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చే నాటికి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ తొలగిపోయినా.. ఆ యా లబ్ధిదారులకు పూర్తి స్థాయి సాయం పంపిణీపై సందిగ్ధం నెలకొంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడం, గత ప్రభుత్వ ప్రాధాన్యత ల కంటే మెరుగైన విధంగా కొత్త పథకాల రూ పకల్పనకు సన్నద్ధమవుతుండడంతో ఈ పరిస్థి తి ఏర్పడింది. దీంతో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ వద్ద నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ వాటి ని అర్హులకు ఇవ్వాలా? వద్దా? అనే అయో మయం అధికారులను కలవరపెడుతోంది.



**అన్నీ పక్కన పెట్టినా గ్రేటర్‌కు మాత్రం మినహాయింపు** : తెలంగాణ దళితబంధు పథకం రెండో విడత కింద అప్పటి ప్రభుత్వం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి వెయ్యి చొప్పున యూనిట్లు మంజూరు చేసింది. ఈమేరకు క్షేత్రస్థాయి నుంచి శాసనసభ్యులు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రతి పాదనలను పంపారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో వా టన్నింటినీ పక్కన పెట్టారు. అయితే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మురుగు వ్యర్థాల సేకరణ(సిల్ట్ కార్టింగ్ వెహికల్స్) వాహనాలకు డిమాండ్ ఉండడంతో 2023%--%24 వార్షిక సంవత్సరంలో 162 యూనిట్లను మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన లబ్దిదారులకు అందించారు. ఈ వాహనాలను జీహెచ్ఎంసీలో వినియోగించుకోనున్నారు. ఇందుకు సంబంధించి జలమండలి(హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) ఒప్పందం కుదుర్చుకుంది.

ఇంకా ఇవ్వాల్సింది 230 యూనిట్లకు మాత్రమే..: అదేవిధంగా హైదరాబాద్ పరిధిలో ఇతర కేటగిరీలకు సంబంధించి మరో 230 యూనిట్లకు మంజూరు తెలిపిన ప్రభు త్వం అర్హుల ఖాతాల్లో తొలివిడతలో భాగంగా రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు నిధిని జమ చేసింది. మిగతా నిధులను జమచేయాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఆ నిధులు ఎస్సీ కార్పొరేషన్ వద్దే ఉండిపోయాయి. ప్రస్తుతం కోడ్ పూర్తి కాగా... నిధులను మాత్రం అధికారులు లబ్దిదారుల ఖాతాకు విడుదల చేయడం లేదు. ఈమేరకు అనుమతి కోరుతూ ఎస్సీ కార్పొరేషన్ అధికా రులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ సమర్పించినట్లు తెలిసింది.

అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. మరోవైపు కొంత మేర ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారులు మిగతా సాయం కోసం ఎదురు చూస్తున్నారు. పూర్తిస్థాయిలో సాయం అందితే నిర్దేశించుకున్న యూనిట్‌లు తెరవాలని ఆశపడుతున్నారు.

# పదేళ్ల దోస్త్‌ను పక్కకు నెట్టనున్న 'పతంగి'!

AIMIM

హైదరాబాద్ : నిజాం కాలం నుంచి, దాదాపు 90 ఏళ్ల చరిత్ర కలిగిన 'ఆల్ ఇండియా మజ్లిస్-ఈ-ఇతిహదుల్ ముస్లిమీన్-మజ్లిస్' పార్టీ అవకాశాలను బట్టి మిత్ర పక్షాలను మార్చడంలో ధిట్ట. గతంలో సుదీర్ఘ కాలం యూపీఏలో కొనసాగిన మజ్లిస్ కాంగ్రెస్ పార్టీని సపోర్ట్ చేస్తూ వచ్చింది. ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అంతగా పాల్గొనకపోయినా.. రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్‌తో దోస్తీ చేసింది. వాస్తవానికి 2014 ప్రభుత్వ ఏర్పాటులో టీఆర్ఎస్ (బీఆర్ఎస్)కు మజ్లిస్ సపోర్ట్ అవసరం లేదు. పూర్తి మెజారిటీతో టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ మరింత మెజారిటీ ఉంటే బిల్లులను ఏకపక్షంగా ఆమోదించుకోవచ్చనే కేసీఆర్ వ్యూహంలో భాగంగా మజ్లిస్ ను కూడా కలుపుకుంది. దాదాపు పదేళ్లు టీఆర్ఎస్ (బీఆర్ఎస్), మజ్లిస్ ట్రావెల్ చేశాయి. ఇప్పుడు ఈ పొత్తుకు బ్రేక్ పడుతుందని రాజకీయల్లో సర్వత్రా చర్చ మొదలైంది. ప్రతిపక్షంలో కాకుండా ప్రభుత్వంతో కలిసి వేళ్తే.. తమ పనులు జరుగుతాయని పతంగి పార్టీ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా మ్యాజిక్ ఫిగర్ కు కేవలం 4 సీట్లు మాత్రమే ఎక్కువగా ఉండడంతో వారిని కూడా కలుపుకోవాలనే చూస్తున్నట్లు తెలుస్తోంది.

**ప్రొటెం స్పీకర్ వ్యూహం పారిందా..** ఇటీవల మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో భాగంగా ప్రొటెం స్పీకర్ గా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరొద్దీన్ ఒవైసీని నియమించింది రేవంత్ ప్రభుత్వం. ఆ సమయంలో బీఆర్ఎస్ నుంచి తీసుకోకపోవడంతో మజ్లిస్ పార్టీ కాంగ్రెస్ తో కలిసి వెళ్తుందని అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ప్రొటెం స్పీకర్ నియామకంలో బీజేపీ మొదటి నుంచి కాంగ్రెస్ పై విమర్శలు గుప్పిస్తూనే ఉంది. ఎంఐఎం ప్రొటెం స్పీకర్ గా ఉంటే బీజేపీ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయమని తెగేసి చెప్పింది. అయినా కూడా కాంగ్రెస్ స్పందించలేదు. ఇక దీనితో పాటు ఇటీవల కాంగ్రెస్ పార్టీ పెట్టిన రివ్యూ మీటింగ్ ను బీఆర్ఎస్ తిరస్కరించింది. కానీ మజ్లిస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. బీఆర్ఎస్ లో ఉన్న మజ్లిస్ తాము కూడా రాలేమని చెప్పాలి. కానీ పిలవడంతోనే ఎటువంటి పేచీ పెట్టకుండా వెళ్లడంతో కాంగ్రెస్ లోకి వెళ్తుందని కన్ఫమ్ అని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఎవరికి లాభం? :** కాంగ్రెస్ తో మజ్లిస్ కలిసి వెళ్లడంపై ఇరు పార్టీలకు లాభమే కలుగుతుందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మొదట కాంగ్రెస్ కు కావాలసినంత మెజారిటీ ఉంటుంది (కాంగ్రెస్ కు 64౦ మజ్లిస్ కు7౦ కలిసి 71). ప్రభుత్వ బిల్లులు సునాయాసంగా ఆమోదం పొందేందుకు వీలుంటుంది. ఇక మజ్లిస్ పార్టీ విషయానికి వస్తే కావలసిన పనులు చేయించుకునే వీలు ఉంటుంది. ప్రతిపక్షంలో ఉంటే దక్కేదేమీ లేదు. దీంతో పాటు పాతబస్తీలో పనులు చేయించుకునే అవకాశం ఉంటుందని తెలుస్తుంది. ప్రస్తుతం బీఆర్ఎస్ అధినేత అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. కాంగ్రెస్ రివ్యూ మీటింగ్ కు వచ్చే సమయంలో ఎంఐఎం నేతలు హాస్పిటల్ కు వెళ్లి కేసీఆర్ ను చూసి, కేటీఆర్ ను పరామర్శించి వచ్చారు. అంటే కేసీఆర్ తో ఈ విషయం మాట్లాడినట్లు చర్చ కూడా జరుగుతోంది.

# సంపాదకీయం

## పాకిస్థాన్ లో కారు కదలడం లేదు... కారణం ఇదే!

ప్రస్తుతం పాకిస్థాన్ ఆర్థిక ఇబ్బందులో కొట్టుమిట్టాడుతుందని.. అక్కడ ప్రజల జీవన ప్రమాణాలు చాలా దారుణంగా పడిపోయాయని.. కరెన్సీ తరుగుదల.. పన్నుల్లో పెరుగుదల భారీగా ఉందని లెక్కలు చెబుతున్నాయి. ఈ సమయంలో పాకిస్థాన్ తాజా పరిస్థితికి అద్దంపట్టేలా పాకిస్తాన్ ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (పీఏఎంఏ) గణాంకాలు తెరపైకి వచ్చాయి. ఈ లెక్కల్లో భారత్ లో సగం రోజుల్లో అమ్మకాలను పాక్ నెలరోజుల్లో చేరుకోలేకపోవడం గమనార్హం! అవును... ప్రతి నెలా మంచి అమ్మకాలతో ఆటోమొబైల్ మార్కెట్ ఇండియాలో దూసుకుపోతుంటే.. పాకిస్తాన్ లో మాత్రం బాగా క్షీణించింది. ఇందులో భాగంగా నవంబర్ నెలలో పాక్ లో కేవలం 4875 కార్లు మాత్రమే అమ్ముడయ్యాయని పీఏఎంఏ వెల్లడించింది. దీంతో అక్కడ కార్ల అమ్మకాలు ఈ స్థాయిలో భారీగా పడిపోవడానికి గలకారణాలపై చర్చ మొదలైంది. తగ్గడం అంటే... మరీ దారుణంగా పడిపోవడం వారి ఆ దేశ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుందని అంటున్నారు. వివరాల్లోకి వెళ్తే... పాకిస్తాన్ ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ లెక్కల ప్రకారం గత నెలలో పాక్ లో కేవలం 4875 కార్లు అమ్ముడైనట్లు తెలుస్తుంది. అయితే... గత ఏడాది ఇదే నెలలో అక్కడి అమ్మకాలు 15,432 కావడం గమనార్హం. దీనిపై స్పందించిన పరిశీలకులు... నిత్యావసర వస్తువులే కొనలేని పరిస్థితిలో ఉన్న ఆ దేశ ప్రజలకు కార్ల కొనుగోలు అసాధ్యం అని చెబుతున్నారు! ఈ కారణంగానే ఈ ఏడాది పాకిస్తాన్ లో ఆటోమొబైల్ మార్కెట్ దారుణంగా క్షీణించింది. ఇందులో భాగంగా... పాక్ సుజుకి 72 శాతం, ఇండస్ మోటార్ 71 శాతం, హోండా అట్లాస్ కార్ 49 శాతం క్షీణించాయి. ప్రధాన వాహన తయారీదారుల అమ్మకాలే ఇలా ఉండటంతో... మిగిలిన పలు సంస్థలు ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసి ప్లాంట్స్ కూడా మూసివేసాయి.

**భారత్ లో పూర్తి భిన్నంగా అమ్మకాలు!:** పాకిస్థాన్ లో కార్ల అమ్మకాల పరిస్థితి అలా ఉంటే... భారత్ లో కార్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది నవంబర్లో మారుతి సుజుకి ఇండియా సేల్స్ 1,64,439.. టయోటా కిర్లోస్కర్ అమ్మకాలు 17,818 యూనిట్లుగా నమోదవ్వగా... దేశంలో జరిగిన మొత్తం కార్ల అమ్మకాలు సంఖ్య 3.60 లక్షల కంటే ఎక్కువగా ఉంది. అంటే... పాకిస్తాన్ లో అమ్ముడైన కార్ల సంఖ్య.. భారతదేశంలో సగం రోజులో అమ్ముడైన కార్ల సంఖ్య కంటే తక్కువని తెలుస్తోంది! ఇదే సమయంలో... "ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్" గణాంకాల ప్రకారం నవంబర్ లో భారత్ లో టూవీలర్ అమ్మకాలు కూడా గణనీయంగా సుమారు 21 శాతం పెరిగినట్లు తెలుస్తోంది.

# తోటి స్నేహితులతో పదేళ్లపాటు కలిసి విద్య అభ్యసించిన మధుర క్షణాల

## జ్ఞాపకానికి వేదికైన పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గరుడ వార్త శామిర్ పేట : ఎంత ఎత్తుకు ఎదిగినప్పటికీ తోటి స్నేహితులతో పదేళ్లపాటు కలిసి విద్య అభ్యసించిన మధుర క్షణాలు, వారి గురువుల సాక్షిగా వారందరిలో మెదలడానికి పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేదికయింది. శామీర్పేట మండల పరిధిలోని అలియాబాద్ గ్రామంలోనున్న అలియాబాద్ జడ్పీహెచ్ఎస్ పదవ తరగతి 2000-2001వ విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి అలియాబాద్ లో నున్న మర్రి ఫామ్స్ ఆదివారం వేదిక అయింది. ముందుగా పూర్వ విద్యార్థులకు విద్యా బోధన చేసిన గురువులచే జ్యోతి ప్రజ్వలన చేయించి, అనంతరం వారికి ఆత్మీయ సన్మానం చేసి వారి గురుభక్తిని మరోసారి చాటుకున్నారు. సదరు విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసి రెండు దశాబ్దాలు దాటినప్పటికీ వారి పదేళ్ల విద్యాభ్యాస ప్రయాణంలోని మధుర స్మృతులను గురువులతో కలిసి నెమర వేసుకున్నారు.

అనంతరం విద్యార్థులందరూ వారి ప్రస్తుత స్థితిగతులను పూర్వ విద్యార్థుల అందరితో కలిసి పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డితో పాటుగా ఉపాధ్యాయులు దామోదర్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, శ్యామల, వెంకట్ రెడ్డితోపాటుగా 2000-2021వ విద్యా సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులైన తాళ్ల జగదీష్, బొమ్మెర్ల శ్రీకాంత్, మసున నవీన్, పడిగే జ్ఞానేశ్వర్, శివాజీ, రమేష్, గణేష్, చాంద్ పాషా, కుమార్, వెంకటేష్, సందీప్, నాగరాజు, శివ, శ్రీలత, కల్పన, సంధ్య, భార్గవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ రహదారికి ఆనుకొని ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో చోరీ



గరుడ వార్త శామిర్ పేట్ : రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో గుర్తు తెలియని దొంగలు వెండి, బంగారు ఆభరణాలను చోరీ చేసిన సంఘటన షామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు బాధితులు తెలిపిన వివరాలను సారం... శామిరపేట్ మండల కేంద్రంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ ఇంచార్జ్ దేశం సత్య స్వామి గౌడ్ యధావిధిగా ఆదివారం రోజు కూడా ఆలయ పనులు ముగించుకొని, దేవాలయం తలుపులు మూసివేసి తాళం వేసి తన ఇంటికి వెళ్లిపోయాడు. కాగా సోమవారం ఉదయం యధావిధిగా గుడికి వచ్చాడు, అయితే గర్భగుడి తాళాలు పగల కొట్టి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగిందని భావించి, గుడి చుట్టూ తిరిగి చూడగా, దేవాలయం వెనకాల ఎడమవైపు ఉన్న గేట్ తాళం విరిగిపోయి ఉండటం గమనించాడు. దీంతో వెంటనే గర్భగుడి ముందు చూడగా రెండు హుండీలు కనిపియ్యకపోవడంతో, గర్భగుడిలో చూడగా అమ్మవారికి ఉన్న నాలుగు వెండి చేతులు, నాగపడిగే, వెండి కిరీటం, ఏడు బంగారు పుస్తెలు మొత్తం కలిపి 5 కిలోల వెండి, మూడున్నర తులాల బంగారు ఆభరణాలను చోరీ జరిగినట్లు గుర్తించారు. దాంతో పాటుగా ఉండిలో ఉన్న డబ్బులు కూడా దొంగిలించారని ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. వెండి బంగారు ఆభరణాల విలువ దాదాపు 5 లక్షల రూపాయల పైనే ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. దీంతో పోలీస్ లు కేసు నమోదు చేసి, క్లూస్ టీంని రప్పించి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

# మణుగూరు.. వనగూరు



ఖమ్మం :అడవి అంటే జంతు ఒడి.. పచ్చని చెట్లతో, భిన్న వర్ణాల పూలతో, స్వచ్ఛమైన పరిమళాలతో మనసును మురిపించే బృందా'వన'మది.. పక్షుల కిలకిలరావాలకు.. రాగాలకూ గొంతు'కారడవే'. క్రిమికీటకాదుల స్వేచ్ఛా సంచారానికి అరణ్యమే శరణ్యం. వనం చిక్కగుంటేనే అందులో ప్రాణులు చక్కగుంటాయి.. వన్య ప్రాణుల భద్రమైన జీ'వనం'లోనే వైవిధ్యం ఇమిడి ఉంది. మనిషి అవసరాలు శ్రుతిమించి, విలాసాలుగా మారిన వేళ అడవి చిన్నబోతోంది. జీవావరణం మాయమవుతోంది. 'నాగరిక మనిషి' దూరిన అడవిలో చెట్లు మొట్లుగా, నదులు పిల్ల కాలువల్లా మారిపోయాయి. అనుభవమైతేగాని తత్వం బోధపడదన్నట్టు ప్రకృతిలో వచ్చిన 'అకాల' మార్పులు మనలో మార్పులు తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోయినచోటే వెతుక్కుంటూ, కోల్పోయిన ప్రకృతి సంపదను పట్టుకునే, రాబట్టుకునే ప్రయత్నం చేస్తోంది మణుగూరు అటవీ యంత్రాంగం. వినూత్న పద్ధతులతో జీవజాలం 'వన'గూరే ప్రయత్నం చేస్తోంది. మణుగూరు అటవీ డివిజన్‌లో పలు రకాల వృక్షాలున్నాయి. వన్య జీవులూ పెద్ద సంఖ్యలో ఉన్నాయి. బొగ్గు గనులు, గోదావరిపై ఆనకట్టల నిర్మాణాలు, విద్యుత్తు కేంద్రాలకు రైలుమార్గం ఇలా అన్నీ అటవీ భూభాగం మీదుగానే విస్తరించాయి. ఇంకా విస్తరిస్తూనే ఉన్నాయి. దీంతో అడవికి, వన్య ప్రాణుల ఉనికికి ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అటవీ జంతు సంతతిని పెంచేందుకు స్థానిక యంత్రాంగం రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా వినూత్న పద్ధతులు తెరపైకి తెచ్చింది. గడ్డిజాతి ప్రాణులు, పక్షిజాతుల వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆరు నెలలుగా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తూ సానుకూల ఫలితాలు సాధిస్తున్నారు. మణుగూరు డివిజన్‌లో మేకజాతి ప్రాణులు దుప్పి, జింక, కొండగొర్రె, గడ్డి జాతులు కుందేలు, దున్నలు, మనుబోతులు, కుక్క జాతులైన నక్కలు, తోడేలు, గుడ్డేలుగులున్నాయి.

జిల్లాలో ఆరు డివిజన్లు ఉండగా మొత్తం 410 లక్షల హెక్టార్ల అడవి ఉంది. మణుగూరులో 22 వేలు, అశ్వాపురంలో 15, ఏడూళ్లబయ్యారంలో 29 వేల హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 79 రకాల వృక్షాలు, 13 రకాల వన్యప్రాణులు, 19 రకాల పక్షి జాతులు ఉన్నాయి.

పక్షి జాతుల కోసం..పక్షి జాతుల కోసం కొలను ఏర్పాటు చేశారు. వెదురు జాతి చెట్లున్న చోట సుమారు 10 హెక్టార్లలో విస్తీర్ణంలో దీన్ని అందుబాటులోకి తెచ్చారు. కొలను చుట్టూ గడ్డి పెంచి పురుగులు, పాముల సంచారం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. పురుగులు వస్తే తొండలు, కప్పలు ప్రవేశిస్తాయి. వాటికోసం పక్షులు వచ్చి వాలుతాయి. వచ్చిన పక్షులు గూళ్లు పెట్టుకునేందుకు వీలుగా వెదురు కర్రలు ఉపయోగపడుతున్నాయి.

వేదిక ఇది..మార్చి నెల నుంచి గడ్డి ఎండిపోతుంది. దీంతో ఆహారం దొరక్క చాలా ప్రాణులు చనిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఆహారం అందించటానికి గడ్డి పెంపకం చేపట్టారు. మణుగూరు మండలం బుగ్గ పరిసరాలను వేదికగా ఎంచుకున్నారు. జంతువుల కోసం..అటవీ డివిజన్‌లో మూడుచోట్ల సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆరు బోర్లను వేసి కొలనులు నిర్మించారు. నిరంతరాయంగా బోరు నీరు కొలనులో చేరుతుంది. ఇదే ప్రాంతంలో ఫైబర్ ఎక్కువగా ఉండే గడ్డి విత్తనాలు చల్లారు. గడ్డికి నీరు అందడం వల్ల ఏపుగా పెరిగింది. దీన్ని తిని, నీరు తాగి జంతువులు ముందుకెళున్నాయి. వేసవిలో జంతువుల అలసట తీర్చటంలో భాగంగా గడ్డి విస్తరించిన ప్రాంతాల్లో ఉప్పుతో కలిపిన రేగడి మట్టి గుంతలు ఏర్పాటు చేశారు. జంతువులు ఈ మట్టిని నాకడం ద్వారా లవణాలు అందుతాయి."మణుగూరు అడవి గుండాల, కిన్నెరసాని, అశ్వాపురం ప్రాంతాల వరకూ విస్తరించి ఉంటుంది. మొత్తంగా వనం కుదింపునకు గురవటంతో పునరుత్పత్తి (రీజనరేషన్) తప్పనిసరైంది. ఇక్కడ బొగ్గు గనుల విస్తరణతో వేల హెక్టార్లకు నష్టం వాటిల్లింది. బుగ్గ ప్రాంతంలో నేలపై పడ్డ విత్తనాలు అగ్గికి కాలిపోకుండా కాపాడి మొక్కలు చేశాం. ఆ మొక్కలు జంతువులకు ఆహారంగా మారాయి. వాటి రక్షణకు

# లక్షలు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలేసి!

మహబూబాబాద్ : ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దాహాన్ని తీర్చుకునేందుకు మనుషులే కాదు మూగ జీవాలు సైతం అల్లాడుతున్నాయి. మేతకు వెళ్లిన జీవాలు నీరు దొరకక అలమటిస్తున్నాయి. ఇంటికి వచ్చే వరకు వాటికి నీరు దొరకడం లేదు. వేసవికాలంలో పశువులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణాలు చేపట్టారు. వాటి నిర్వహణను అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. పలు చోట్లలో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల దాహార్తిని తీర్చేందుకు దాదాపు 1000 పశువుల నీటి తొట్టెలను నిర్మించారు. ఒక్కో నీటి తొట్టికి రూ.20వేల వరకు వెచ్చించారు. ఈ నీటితొట్టెలకు పంచాయతీల ఆధ్వర్యంలో నీటి సరఫరా అందించి పశువుల దాహార్తిని తీర్చడానికి నిర్మించగా అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా అవి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ప్రస్తుతం ఎండల కారణంగా చెరువుల్లో, వాగుల్లో, కుంటల్లో నీరు అడుగంటిపోతోంది.. బయటకు వెళ్లిన పశువు ఇంటికి వచ్చేదాక నీరు దొరకని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో నిర్మించిన తొట్టెలలో నీరు నింపకపోవడంతో మూగజీవాలు ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నాయి.



మూగరోదన..

మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టెలు వివిధ కారణాలతో నిరుపయోగంగా ఉంటున్నాయి. ఫలితంగా నోరు తెరచి అడగలేని ఆ జీవాలు దాహం తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. అవసరం లేని ప్రదేశాల్లో, నీటి జాడలేని స్థలాల్లో నీటి తొట్టెలను నాసిరకంగా నిర్మించి రూ.లక్షల నిధులు వెచ్చించారు. వాటికి పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సరఫరా చేయాల్సి ఉండగా ఎవరు పట్టించుకోవడం లేదు. నీటి జాడను తెలుసుకునేందుకు పాడి రైతులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. దాహార్తితో అలమటిస్తున్న మూగ జీవాలకు రోదన తప్పడం లేదు.

నీళ్లు నింపేలా చర్యలు తీసుకుంటాం..

-ఆశాలత, డీప్మీవో, భూపాలపల్లి జిల్లా

గ్రామాల్లో నిరుపయోగంగా మారిన నీటి తొట్టెలను వినియోగంలోకి తీసుకొస్తాం. తొట్టెలు ఉన్న చోట్ల నీటిని నింపేలా చర్యలు తీసుకుంటాం. నీటి కొరత కారణంగా కొన్ని తొట్టెలు నిరుపయోగంగా మారాయి. నీటి సౌకర్యం లేని చోట ట్యాంకర్‌తో నింపించేలా ఎంపీవోలకు ఆదేశాలు జారీ చేస్తాం. వేసవిలో మూగజీవాల దాహార్తిని తీరుస్తాం.

# పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు

మహబూబాబాద్ : విద్యార్థుల్లో చదువుతోపాటు జీవన నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా పలు కార్యక్రమాలు చేపడుతోంది. సమగ్ర శిక్ష పథకంలో భాగంగా విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు నేర్పించేందుకు చర్యలు చేపడుతోంది. జిల్లాలోని పలు ఆదర్శ పాఠశాలల్లో ఇప్పటికే ఈ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. 2020 నూతన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా సెకండరీ, హయ్యర్ సెకండరీ విద్యలో వృత్తి విద్యా కోర్సులను అమలు చేస్తున్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆదర్శ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం అమలవుతోంది.

మరిన్ని బడులకు విస్తరణ

ఈ విద్యా సంవత్సరంలో ధర్మకంచ, శివునిపల్లి, పాలకుర్తి జడ్పీహెచ్ఎస్‌లో ఈ కోర్సులను ప్రారంభించనున్నారు. వచ్చే ఏడాది జిల్లాలోని మరో 3 ప్రభుత్వ బడులతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, జనగామ కస్తూర్బా విద్యాలయాల్లో అమలు చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు



సమాచారం. ప్రతి పాఠశాలలో రెండు కోర్సులు ఉంటాయి, ఒక్కో కోర్సుకు రెండేళ్ల వ్యవధి ఉంటుంది. వచ్చే ఏడాది మరిన్ని బడులకు ఈ కోర్సులను విస్తరించనున్నారు.

విద్యార్థులకు మంచి అవకాశం: శ్రీనివాస్, ఏఎంవో, జనగామ

ప్రభుత్వం ప్రవేశపెట్టిన వృత్తి విద్యా కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. నైపుణ్యం చూపితే భవిష్యత్తులో ఉపాధి కూడా పొందగలుగుతారు. తమ కాళ్లపై తాము నిలబడగలుగుతారు. భవిష్యత్తులో విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కోర్సులను అమలు చేస్తోంది.

బోధన విధానం ఇలా..ఈ పథకంలో ఒక్కో వృత్తి విద్యా కోర్సుకు వారానికి మూడు పీరియడ్లు కేటాయిస్తారు. ఈ లెక్కన రెండు కోర్సులకు వారానికి ఆరు పీరియడ్లు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేక కన్సల్టెన్సీలతో వీటిని అమలు చేస్తున్నా రు. ఇప్పటికే ప్రతి బడికి ఇద్దరు శిక్షకులను కూడా నియమించారు. వ్యవసాయం, అప్పారెల్, ఆటోమోటివ్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, ఐటీ అండ్ ఐటీఈఎస్, మీడియా ఎంటర్‌టైన్‌మెంట్, రిటైల్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్, ప్లంబర్ తదితర కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని 8 ఆదర్శపాఠశాలల్లో ఈ కోర్సులను అమలు చేస్తున్నారు.

# మద్యం మత్తు.. జీవితాలు చిత్తు!

పెద్దపల్లి : కమాన్‌పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి (38) కూలి పని చేస్తూ జీవించేవాడు. మద్యానికి బానిస కావడంతో భార్య ఇద్దరు పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లిపోయింది. ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు.రామగిరి మండలానికి చెందిన యువకుడు (32) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మద్యానికి బానిసై.. జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి చనిపోయాడు. భార్య, కూతురు, కుమారుడు అనాథలయ్యారు. పై సందర్భాల్లో బలవన్మరణలకు పాల్పడిన వ్యక్తులు మద్యానికి బానిసైనవారే. వారి ఇంటి నుంచి మద్యం గొలుసు దుకాణాలు కేవలం 10 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. గ్రామాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్ట్ షాపులు కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. కుటుంబ పెద్దదిక్కు మద్యానికి బానిసై.. క్షణికావేశంలో తనువు చాలిస్తుండటంతో భార్యా, పిల్లలు రోడ్డున పడుతున్నారు. భర్తలు రోజువారీ కూలీ డబ్బులు మద్యానికే ఖర్చు చేస్తుండటంతో కుటుంబపోషణ భారం మహిళలపై పడుతోంది. శుభకార్యాలు, జన్మదిన వేడుకల పేరుతో యువత, విద్యార్థులు మద్యానికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అఘాయిత్యాలకు సైతం పాల్పడుతున్నారు. నిత్యం ఎక్కడో ఓ చోట



మద్యం మత్తులో రహదారి ప్రమాదాలు, హత్యలు, ఆత్మహత్యలు, ఇతర అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కిరాణం దుకాణాలు, పాన్ టేలాలు, బేకరీలు, హోటళ్లలో విచ్చలవిడిగా మద్యం లభిస్తోంది. గ్రామాల్లో, తండాల్లో గొలుసు కట్టు మద్యం దుకాణాలకు అడ్డుకట్ట వేయాలని ఆబ్కారీ, పోలీస్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గతంలో మహిళలు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వం గొలుసు దుకాణాలపై చర్యలు తీసుకోవాలన్న ఆలోచనతో ఉన్న నేపథ్యంలో అధికారులు కఠినంగా వ్యవహరిస్తేనే ఆ దుకాణాల నిర్వహణకు అడ్డుకట్ట పడనుంది.

పెద్ద మొత్తంలో స్వాధీనం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 290 మద్యం దుకాణాలున్నాయి. కొత్త మద్యం దుకాణాల్లో ఈ నెల డిసెంబరు 1 నుంచి మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో జిల్లాలో 700 వరకు గొలుసు దుకాణాలుంటాయి. ఈ లెక్కన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 2,800 బెల్ట్ దుకాణాలుంటాయని అంచనా. ఇటీవల ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు రూ.4.10 కోట్ల విలువైన 99,598 లీటర్ల మద్యం నిల్వలు గ్రామాలు, కాలనీల్లో స్వాధీనం చేసుకున్నారు. ఓటర్లను ఆకర్షించుకునేందుకు గొలుసు దుకాణాల ద్వారా మద్యం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకోగా అడ్డుకట్ట వేశారు.

# బకాయిల కొండ.. సంస్థకు గుదిబండ

నల్గొండ : విద్యుత్తు సంస్థ మనుగడ సాధించాలంటే కరెంటు బిల్లులు ప్రతి నెలా వందశాతం వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలోని నల్గొండ, యాదాద్రి, సూర్యాపేట సర్కిళ్ల పరిధిలో సిబ్బంది అలసత్వం, వినియోగదారుల నిర్లక్ష్యంతో నెలనెలా గుట్టల మాదిరిగా రూ.కోట్లల్లో విద్యుత్తు బకాయిలు పేరుకుపోతున్నాయి. వినియోగదారులకు తోడు ప్రభుత్వ సంస్థ పరిధిలోని కార్యాలయాలు, వీధిదీపాలు, మంచినీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన విద్యుత్తు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో విద్యుత్తు సంస్థ అప్పుల ఊబిలోకి కురుకుపోతోంది. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి వారంలో వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. జీతాల కోసం నిరీక్షించాల్సిన దుస్థితికి చేరింది.

నెలనెలా 90 శాతమే వసూలు

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మూడు సర్కిళ్ల పరిధిలో అన్ని రకాల సర్వీసులు కలిపి సుమారు రూ.12.66 లక్షలకు పైగా ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా రూ.634 కోట్లు డిమాండ్ ఉండగా, అందులో 90 శాతం వరకు విద్యుత్తు బిల్లులు వసూలు చేస్తున్నారు. మిగతా బిల్లుల మొత్తం ప్రతి నెలా బకాయిల్లో చేరుతున్నాయి. దీనికి తోడు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు, రజక, నాయీబ్రాహ్మణ, ఎస్సీలకు అందిస్తున్న ఉచిత విద్యుత్తు బిల్లులను ప్రభుత్వం విడుదల చేయక



పోవడంతో బకాయిలు కొండలా పేరుకుపోతున్నాయి. నల్గొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో బకాయిలు రూ.212.43 కోట్లకు చేరాయి. రాష్ట్రంలో కొత్తగా పాలన పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా 200 యూనిట్ల లోపు విద్యుత్తు వాడిన సుమారు 9 లక్షల మంది వినియోగదారులకు ఉచిత విద్యుత్తు అందించాల్సి ఉంది. ఫలితంగా సంస్థకు ప్రతి నెలా రావాల్సిన ఆదాయం తగ్గిపోయే ప్రమాదం ఉందని విద్యుత్తు సంస్థ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శత శాతం వసూలుకు కృషి–చంద్రమోహన్, ఎస్ఈ, నల్గొండ సర్కిల్

విద్యుత్తు బిల్లులను ప్రతి నెలా వందశాతం వసూలుకు కృషి చేస్తున్నాం. ఇంజినీర్లకు, సిబ్బందికి లక్ష్యం విధించి బకాయిలు వసూళ్ల ప్రక్రియ నిర్వహిస్తున్నాం. నాణ్యమైన కరెంటు అందించేందుకు, విద్యుత్తు సంస్థ మనుగడ కోసం వినియోగదారులు బిల్లులను బకాయిలతో సహ చెల్లించి సహకరించాలి.

# గణితం గడబిడ కాదు..



కరీంనగర్ : గణితం అనగానే ఎక్కువ మంది విద్యార్థులు భయపడుతుంటారు. నిత్యజీవితంలో ప్రధాన పాత్ర పోషించే లెక్కలకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలు, సిద్ధాంతాలపై అవగాహన పెంచుకుంటే విద్యార్థులు రాణించగలరు. ఈ భావనను అర్థం చేసుకొని గణితాన్ని అర్థమయ్యేలా బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు. గణితం గడబిడ కాదు.. దృష్టి సారిస్తే సులువుగా నేర్చుకోవచ్చని నిరూపిస్తున్నారు. ప్రత్యేక ఉపకరణాలు, వీడియో పాఠాలు, కృత్యాలతో బాలల మెదళ్లలోకి గణిత భావాలు ఎక్కిస్తున్నారు. జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ బోధనతో ఆకట్టుకుంటున్న కొందరు గణిత ఉపాధ్యాయులపై కథనం.

బాలల ప్రపంచ రికార్డు కోరుట్ల అంబేడ్కర్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బాలలు లెక్కల్లో ప్రపంచ రికార్డు నెలకొల్పేలా తీర్చిదిద్దారు ప్రధానోపాధ్యాయుడు అడ్లగట్ల గంగాధర్. 11 ఏళ్లు ఇక్కడ పని చేసిన ఆయన ఇటీవల జగిత్యాలకు బదిలీ అయ్యారు. అబాకస్‌లో ప్రావీణ్యుడైన ఆయన అక్కడ పనిచేసిన కాలంలో ప్రాథమిక తరగతుల బాలలు గణిత చతుర్విధ ప్రక్రియలను చేతివేళ్ల సాయంతో శిక్షణ అందించారు. అంగుళీయ అబాకస్‌తో వాటిని నేర్పించి బాల్యంలోనే గణితంపై చిన్నారుల్లో అభిరుచి పెంచారు. 2020లో 5వ తరగతి విద్యార్థులు 12 నిమిషాల్లో 1 నుంచి 100 ఎక్కాలు నోటితో అత్యంత వేగంగా చదివించి వండర్ బుక్ ఆఫ్ రికార్డును నెలకొల్పేలా చేశారు. ఈ ఏడు మార్చిలో 1వ తరగతి బాలలు ఒక నిమిషంలో కూడికలు, తీసివేతలకు సంబంధించిన 30 లెక్కలు సాధించేలా తీర్చిదిద్ది ఇంటర్నేషనల్ జూనియర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించేలా కృషి చేశారు. బాల్య దశలోనే గణితంలో అద్భుతాలు సృష్టిస్తున్న బాలలు ఆ పాఠ్యాంశంలో భవిష్యత్తులో రాణించే అవకాశముంది.

దక్షిణ భారత స్థాయికి..

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పి.హరిప్రసాద్ స్వతహాగా తయారు చేసిన ఉపకరణాలతో బోధనలో ఆకట్టుకుంటున్నా. గణిత నమూనాలను రూపొందించి దక్షిణ భారత సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ఈయన మరో ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులతో కలిసి మొబైల్ గణిత ప్రయోగశాలను ఏర్పాటు చేసి పలు పాఠశాలలకు వెళ్లి బోధిస్తున్నారు. దక్షిణ భారత సైన్స్ ఫెస్టివల్‌లలో నాలుగు సార్లు పాల్గొని గణిత నమూనాలను ప్రదర్శించిన ప్రత్యేకత చాటారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతులు అందుకున్నారు. శిష్యులు గణిత ఒలింపియాడ్, ప్రతిభా పోటీ పరీక్షల్లో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఏటా పాల్గొనడం అతని బోధన నైపుణ్యాలకు నిదర్శనం. పాఠశాల స్థాయిలో విద్యార్థులు ఆహ్లాదంగా గణితం పట్టు సాధించేందుకు రంగోలి, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు.

ఆసక్తి కలిగించేలా...

పెద్దపల్లి జిల్లా మంథని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలికలు) ఉపాధ్యాయుడు గీట్ల భరత్‌రెడ్డి రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ(గణితం) బృంద సభ్యులు. మన చుట్టూ కనిపించే ప్రతి వస్తువులో గణితం ఉంటుందనే విషయాలను విద్యార్థుల్లో ఆసక్తి కలిగించేలా బోధిస్తుంటారు. ఉపకరణాలను రూపొందించి వినూత్న రీతిలో పాఠాలు చెబుతూ లెక్కలంటే భయాన్ని తొలగిస్తారు. కఠిన భావనలను సులువైన పద్ధతిలో సులభంగా బోధిస్తున్నారు. కృత్యాధార బోధన ద్వారా బీజ గణిత సర్వ సమీకరణాలను సులభంగా అర్థం చేసుకుంటారు. నిత్య జీవితంలో లెక్కలు ఎలా ఉపయోగపడుతాయో అనే విషయాలను విపులంగా వివరిస్తున్నారు.

సొంతంగా సాధించేలా..

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎర్రబెల్లి అశోక్ ప్రభుత్వం కల్పించిన డిజిటల్ బోర్డు ద్వారా ఆసక్తిగా బోధిస్తున్నారు. కృత్యాధార బోధనకు తోడు వివిధ రకాల ఉపకరణాలను ఉపయోగిస్తున్నారు. విద్యార్థులు స్వతహాగా గణిత సమస్యలు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. తద్వారా విద్యార్థుల్లో ఈ పాఠ్యాంశమంటే భయం తొలగడంతోపాటు అందులో పట్టు సాధిస్తున్నారు, పరీక్షల్లో ఏటా మిగిలిన పాఠ్యాంశాలతో సరిసమానంగా రాణిస్తున్నారు. గణిత దినోత్సవం రోజు విద్యార్థులకు గణిత మేళా, క్విజ్, ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించి వారి ఆసక్తిని ప్రోత్సహిస్తున్నారు. ఐసీటీ, డిజిటల్ బోర్డులు ఎలా వినియోగించవచ్చో అనే అంశంపై ఎస్‌సీఈఆర్టీ వారు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర గణిత సదస్సుకు అశోక్ ఎంపికయ్యారు.కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎలుగం మహేశ్వర్ విద్యార్థులకు గణితం సులభంగా అర్థమయ్యేలా ఉపకరణాలతో బోధిస్తున్నారు. అట్టముక్కలు, డ్రాయింగ్ షీట్స్, అందుబాటులోని ఇతర వస్తువులతో నమూనాలు తయారు చేసి తరగతి గదిలో ప్రదర్శిస్తుంటారు. అమూర్త గణిత భావనలు, రేఖాగణితాలకు సంబంధించి అన్ని భావనలతో బోధిస్తుండటంతో పట్టు సాధిస్తున్నారు. త్రికోణమితిని ఉపయోగించి చెట్లు, భవనాల ఎత్తులను కనుగొనేలా బాలలను ప్రోత్సహిస్తున్నారు. మరికొన్ని భావనలను నేర్పించేందుకు కంప్యూటర్‌లో క్లిక్స్ మాడ్యుల్స్, జియోజీబ్రాను వాడుకుంటున్నారు. గణిత ప్రాజెక్టులను కూడా విద్యార్థులతో తయారు చేయించి పోటీల వైపు ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల్లో గణితంపై అభిరుచి పెంచి.. సత్ఫలితాలను సాధిస్తున్నారు.

# సర్వేల్ గురుకులం.. సమస్యల నిలయం




నల్గొండ : బాలుర కోసం రాష్ట్రంలో నెలకొల్పిన ఏకైక గురుకుల జూనియర్ కళాశాల. ఇందులో చేరాలంటే తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహించే టీఎస్ఆర్జేసీ సెట్ రాయాల్సి ఉంటుంది. ఏటా సుమారు 60–70 వేల మంది విద్యార్థులు ప్రవేశపరీక్ష రాస్తుంటారు. వారిలోంచి అత్యుత్తమ ర్యాంకు, రిజర్వేషన్ల ప్రకారం ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో కలిపి అగ్రస్థానంలో ఉండే 180 మందికి ప్రవేశం కల్పిస్తారు. రాష్ట్ర విద్యాశాఖ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ గురుకుల జూనియర్ కళాశాల యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గ్రామంలో ఉంది. తమ భవిష్యత్తు ఎంతో గొప్పగా ఉంటుందని ప్రవేశ పరీక్ష రాసి ఈ గురుకుల కళాశాలలో చేరిన విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గురు శిష్యులు ఒకే ప్రాంగణంలో నివాసం ఉండాలన్న నిబంధన అమలు కావడం లేదు. గురుకులాల స్ఫూర్తితో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన శాంతినికేతన్ తరహాలో సర్వేల్‌లో గురుకుల పాఠశాలను 1971లో, 1994లో గురుకుల జూనియర్ కళాశాలను ప్రారంభించారు. కానీ ఇక్కడ అసౌకర్యాలు, అధ్యాపకుల కొరతను చూసి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ప్రవేశం పొందిన తర్వాత సుమారు 55 మంది విద్యార్థులు మధ్యలోనే తమ ప్రవేశాన్ని రద్దు చేసుకొని ఇంటిదారి పట్టారు.

అధ్యాపకుల కొరతసర్వేలులోని గురుకుల జూనియర్ కళాశాలలో 360 మంది విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, ప్రయోగశాలలు లేవు. సగం తరగతులను రేకుల షెడ్డులోనే నిర్వహిస్తున్నారు. విద్యార్థులు పడుకునేందుకు డార్మెటరీలు తగినన్ని లేవు. 180 మందికి సరిపోయే గదుల్లో 360 మంది సర్దుకోవాల్సి వస్తుంది. ఇరుకు గదుల్లోనే ట్రంకు పెట్టెలు, బకెట్ల మధ్య చాపలు పరుచుకుని పడుకుంటున్నారు. విజ్ఞానాన్ని అందించే పదివేల పుస్తకాలు ఉన్నా గ్రంథ పాలకుడు లేరు. ఇంతటి ప్రతిష్ఠాత్మక కళాశాలలో మూడేళ్లుగా సంస్కృతం, కెమిస్ట్రీ, గణితం బోధించే అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయిదేళ్ల క్రితం గ్రంథపాలకుడు ఉద్యోగ విరమణ చేసినా ఇప్పటికీ భర్తీ చేయలేదు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి తగిన విధంగా తర్ఫీదునిచ్చే ఫిజికల్ డైరెక్టర్ పోస్టు అయిదేళ్లుగా ఖాళీగా ఉంది. 13 మంది అధ్యాపకులున్నా వారు కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థులతో కలిసి ఉండేందుకు వీలుగా నివాస గృహాలు నిర్మాణం చేయించలేదు. జేఈఈ, నీట్ శిక్షణనిచ్చేందుకు ప్రత్యేక బోధకులు లేరు. ప్రభుత్వం ఆహార పట్టిక (మోనూ) పాటించడం లేదు. ఇటీవల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన బుర్రా వెంకటేశం సర్వేల్ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతో ఈ కళాశాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తారని విద్యార్థులు ఆశిస్తున్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ...– సతీష్, ప్రిన్సిపల్, తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాల, సర్వేలు

గ్రామీణ పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మా కళాశాలను నిర్వహిస్తున్నాం. అధ్యాపకుల ఖాళీలున్నా కాంట్రాక్టు లెక్చరర్లను నియమించి బోధన చేయిస్తున్నాం. డార్మెటరీ నిర్మాణం కోసం ఆర్నెల్ల క్రితం రూ.42 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. నేలపై నిద్రించకుండా మంచాలు కొనుగోలు చేయనున్నాం. నాలుగు ప్రయోగశాల భవనాలు, అదనపు తరగతి గదులు నిర్మాణం చేయించాలని, ఖాళీలను భర్తీ చేయించాలని మా సంస్థ కార్యదర్శిని కోరాం.

# అల్పాహార బిల్లులొచ్చాయి..!

నల్గొండ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో కొంతమంది వివిధ కారణాలతో ఉదయం అల్పాహారం తీసుకోకుండానే పాఠశాలకు హాజరవుతున్నట్లు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తెలిసింది. దీంతో సదరు విద్యార్థులు మధ్యాహ్నం వరకు ఖాళీ కడుపుతో పాఠాలు సరిగా వినడం లేదనే భావించిన గత ప్రభుత్వం మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో సీఎం అల్పాహార పథకాన్ని నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున ప్రభుత్వం అక్టోబరు 6న ప్రారంభించింది. దసరా సెలవుల అనంతరం ఆయా జిల్లాల కలెక్టర్ల చొరవతో పాఠశాలల సంఖ్యను పెంచారు. ఇటీవల ఎన్నికలు జరగడం, కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పథకం అమలుపై కొంత సందిగ్ధత నెలకొంది. అయితే ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అల్పాహార ఖర్చుల నిమిత్తం నిధులు మంజూరు చేసింది. ఇటీవలే విద్యాశాఖ ఉన్నతాధికారులు అక్టోబరు, నవంబరు నెలలకు సంబంధించిన నిధులు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేయడంతో నిర్వాహకులకు ఊరటనిచ్చింది. సీఎం అల్పాహార పథకం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 118 పాఠశాలలకు రూ.17,15,843 నిధులు మంజూరయ్యాయి.ఆదేశాలు రాగానే అమలు చేస్తాం –భిక్షపతి, జిల్లా విద్యాధికారి, నల్గొండ 'జిల్లాలో ప్రస్తుతం సీఎం అల్పాహారం పథకం అమలవుతున్న పాఠశాలలకు అక్టోబరు, నవంబరు నెలలకు సంబంధించిన నిధులు మంజూరయ్యాయి. అన్ని పాఠశాలల్లో అమలుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే అమలయ్యేలా చూస్తాం.

# చెరువులో స్థిరాస్తి చేపలు..!

దేవరకొండ : ఈ చిత్రంలో కన్పిస్తున్న గృహ నిర్మాణాలు ఇప్పటికే హనుమాన్‌నగర్ తుల్చమ్మకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించారు. ఆ పరిధిలోనే మరో నిర్మాణం ఇటీవల జోరుగా కొనసాగిస్తున్నారు. స్థిరాస్తి వ్యాపారులు సాధారణ ప్రజలకు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాట్లు విక్రయిస్తూ అంటగడుతున్నారు. ఇంటి యజమానులు నిర్మాణం చేపడుతుండటంతో కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులకు అది కాస్తా కాసుల పంటగా మారుతోంది.

దేవరకొండ రెవెన్యూ డివిజన్ కేంద్రం, పురపాలిక కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై ఉండటంతో భూములకు రెక్కలొచ్చాయి. ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ శాఖలకు సంబంధించిన ఖాళీస్థలం కన్పిస్తే చాలు అక్రమార్కులు వాలిపోతున్నారు. జాతీయ రహదారి వెంట, చెరువుల కాల్వలను సైతం ఆక్రమించి వెంచర్లు చేపడుతున్నారు. ప్రస్తుతం వారి కన్ను చెరువులపై పడింది. తుల్చమ్మకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో దాదాపు 20 ఎకరాల్లో అక్రమంగా ఎన్నో వెంచర్లు వెలిశాయి. ఎఫ్‌టీఎల్ పరిధిలో గృహాలకు అనుమతి ఉండదని తెలిసినా అమాయక ప్రజలకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

యథేచ్ఛగా నిర్మాణాలు

పట్టణంలోని కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై కల్వకుర్తి రోడ్డులో చెరువు, కాల్వల పరిధిలో అక్రమంగా స్థిరాస్తి వ్యాపారులు వెంచర్లు చేసి విక్రయిస్తున్నారు. సామాన్యులు కొనుగోలు చేసి ఇక్కట్లు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. కొంతమంది స్థానిక నాయకుల అండదండలతో



గృహ నిర్మాణం చేపట్టినప్పటికీ తర్వాత పర్యావసానం ఎదుర్కోవాల్సి వస్తోంది. నీటి పారుదలశాఖ, పురపాలిక అధికారులు మాత్రం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదని చెబుతున్నప్పటికీ నిర్మాణాలు మాత్రం యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. రెండు నెలల క్రితం దేవరకొండ పట్టణం మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా తుల్చమ్మకుంట చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్ హద్దులను పురపాలిక, నీటి పారుదలశాఖ అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ రాత్రి, పగలు తేడా లేకుండా నిర్మాణాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఇటీవలనే ఓ స్థిరాస్తి వ్యాపారి అక్కడ పెద్దఎత్తున నిర్మాణం చేపట్టేందుకు పునాది తీయడంతో పలు ప్రజాసంఘాల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశారు.

కేసు పెట్టాం–నగేష్, నీటి పారుదలశాఖ ఏఈ

తుల్చమ్మకుంట వద్ద అనుమతి లేకుండా నిర్మించుకుంటున్న గృహ యజమానులపై దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. మా సిబ్బందిని సైతం పంపి పనులు నిలిపివేయాలని ఇంటి యజమానులకు సూచించాం.


నోటీసులు పంపాం–వెంకటయ్య, పురపాలిక కమిషనర్

తుల్చమ్మకుంట పరిధిలో నిర్మాణాలు చేపట్టే ఇంటి యజమానులకు నోటీసులు పంపాం. ఎఫ్‌టీఎల్ పరిధిలో నీటి పారుదలశాఖ నుంచి ఎన్‌వోసీ పొందాకే అనుమతి ఇస్తాం.

# రేషన్ కార్డుల మంజూరుకు కసరత్తు!

సూర్యాపేట : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేసిన ఏ సంక్షేమ పథకం వర్తించాలన్న రేషన్ కార్డులు తప్పనిసరి. పదేళ్లుగా ఈ కార్డుకు నోచుకోక ప్రభుత్వం అందిస్తున్న బియ్యంతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు పేదలు దూరమవుతున్నారు. ముఖ్యంగా పిల్లల పేర్లు నమోదు కాక తల్లిదండ్రులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన ఉచిత బియ్యంతో పాటు మూడు నెలల పాటు అందించిన రూ.1500 పథకానికి చాలా మంది నోచుకోలేదు. రెండు పడక గదుల ఇళ్లు, ఆరోగ్యశ్రీ తదితర పథకాలకు దూరమయ్యారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుల మంజూరుకు కసరత్తు చేస్తోంది. అందుకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ఎలా చేసుకోవాలి, ఎప్పటి నుంచే చేసుకోవాలనే విషయమై త్వరలో స్పష్టత రాబోతోంది. అన్నీ సవ్యంగా జరిగితే రేషన్ కార్డుల కోసం పదేళ్ల పాటు ఎదురు చూసిన లబ్ధిదారుల కల నెరవేరుతుంది.

మార్పులకు అవకాశం ప్రస్తుతం రేషన్ కార్డుల్లో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అప్పటికే రేషన్ కార్డు ఉండి తమ పిల్లల పేర్లు నమోదు చేయడానికి గత ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు. పెళ్లై అత్తగారింటికి వెళ్లిన వధువు పేరును పుట్టింటి కార్డులోంచి తొలగించారు. కానీ అత్తగారింట్లో మాత్రం నమోదు చేయలేదు. పేర్ల మార్పులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరంతా కొన్నేళ్లు




గా ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం పేర్ల మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పించనుండటంతో వారందరికీ లబ్ధి చేకూరనుంది.

పాత దరఖాస్తులపై సందిగ్ధం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 10,07,259 రేషన్ కార్డులున్నాయి. వీరికి ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయి. గత ప్రభుత్వంలో రేషన్‌కార్డు, పేర్ల మార్పుల కోసం 30,432 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు మళ్లీ చేసుకోవాలా... లేకుంటే పాత వాటిని పరిగణనలోకి తీసుకుని మంజూరు చేస్తారా అన్న సందిగ్ధం నెలకొంది. కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు వారు ఈ నెల 28 నుంచి చేసుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. దరఖాస్తు ఎలా చేసుకోవాలన్నది ప్రభుత్వం త్వరలో నిర్ణయిస్తుంది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది

– మోహన్‌బాబు, డీఎస్వో, సూర్యాపేట

రేషన్‌కార్డులకు దరఖాస్తులు ఎప్పటి నుంచి చేసుకునే విషయమై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. కార్డుల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే గతంలో వచ్చిన దరఖాస్తుల గురించి ప్రభుత్వానికి నివేదించాం.

# ఆటో పర్మిట్‌కే రూ.2.5 లక్షలు!

హైదరాబాద్: ఆటో పర్మిట్ల పేరుతో నగరంలో భారీ దందా నడుస్తోంది. కొత్త ఆటో కావాలంటే పర్మిట్ కోసం కనీసం రూ. 2.5 లక్షలు వెచ్చించాల్సిందే. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో తమకు నష్టమని గగ్గోలు పెడుతున్న ఆటో డ్రైవర్లను మరోవైపు ప్రైవేటు ఫైనాన్షియర్లు అడ్డగోలుగా దోచుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కొత్తఆటో రూ. 2 లక్షలు, రూ. 2.25 లక్షలు ఉంటే.. అదే గ్రేటర్‌లో కొనాలంటే రూ. 4.5 లక్షల నుంచి రూ. 5లక్షల వరకు వెచ్చిస్తున్నారు. కొందరు దళారులు, ప్రైవేటు ఫైనాన్షియర్లు పర్మిట్లను గుప్పిట్లో పెట్టుకొని ఆటో డ్రైవర్లను నిలువునా ముంచుతున్నారు. గ్రేటర్‌లో కొత్త ఆటో కొనాలంటే పర్మిట్ తప్పనిసరి. లేదంటే రిజిస్ట్రేషన్ చేయరు. గ్రేటర్‌లో ప్రస్తుతం 1.3 లక్షల వరకు ఆటోలు తిరుగుతున్నాయి. కాలుష్యం, ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గతంలో ప్రభుత్వం పర్మిట్లను నిలిపివేసింది. 2014కు ముందు కొత్తగా 20 వేల కొత్త పర్మిట్లు విడుదలచేసింది. ప్రస్తుతం గ్రేటర్‌లో ఆటో కొనుక్కొని తిప్పాలంటే పాత పర్మిట్‌తోనే కొత్త ది కొనుక్కోవాల్సి వస్తోంది. పాత ఆటోని తుక్కు కింద మార్చి రవాణాశాఖ అనుమతితో కొత్తగా పర్మిట్ తీసుకోవాలి. అప్పుడే కొత్త ఆటో కొనేందుకు అవకాశం ఇస్తారు. ఇదే అవకాశంగా కొందరు పర్మిట్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తుస్తూ భారీగా వసూలు చేస్తున్నారు.



అప్పుల్లో చిక్కుకొని..ఎక్కువ శాతం మంది ఆటోడ్రైవర్లు ప్రైవేటు ఫైనాన్సియర్ల వద్ద రుణాలు తీసుకొని ఆటోలు కొంటున్నారు. తర్వాత ఈ మొత్తానికి కిస్తీలు కట్టలేక అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. అప్పు తీర్చే వరకు పర్మిట్లను డ్రైవర్ల పేరుతో బదిలీ చేయకపోవడంతో సులువుగా డ్రైవర్ల నుంచి ఆ ఆటోలను స్వాధీనం చేసుకుంటున్నారు. వీటిని తిరిగి ఇతరులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. యాజమాన్య పేరు మాత్రం పాత డ్రైవర్‌తోనే నడుస్తూ ఉంటుంది. ఇలా నగరంలో 50-70 వేల పైనే ఆటోలు తిరుగుతున్నాయి. పేద ఆటో డ్రైవర్ల నుంచి దళారులు, ఫైనాన్సియర్లు ఎంతోకొంతకు పర్మిట్లు తీసుకొని వాటిని రెండింతల ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరైతే జిల్లాల్లో ఆటోలను కొని అక్కడే రిజిస్ట్రేషన్ చేయించుకొని వాటిని నగరంలో తిప్పుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల కంటపడితే చలనా చెల్లిస్తున్నారు. నగరంలో ఇదంతా ఒక వ్యవస్థీకృత దందాగా చలామణి అవుతోంది. ఏళ్లుగా కొందరికి ఈ దందా రూ.కోట్ల వర్షం కురిపిస్తోంది. కొత్త ఆటో పర్మిట్ల జారీలో ఒక శాస్త్రీయ విధానమంటూ లేకపోవడమే దీనికి ప్రధాన కారణం.


# అంతటా అప్రమత్తం

వికారాబాద్ : దేశంలో కరోనా కొత్త వేరియంట్ జే-1 కేసులు వెలుగు చూస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. కొవిడ్ లక్షణాలు ఉన్నవారికి వైద్య సేవలు అందించాలని ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 25 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఇతర ఆస్పత్రుల్లో వైద్యాధికారులు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించి నెలకు 7,500 పరీక్షలు

వైద్యులు, సిబ్బంది కొవిడ్ ప్రబలకుండా సమావేశాలు నిర్వహించి తదుపరి కార్యాచరణ రూపొందించాలని ఉన్నతాధికారులు సూచించారు. కేసుల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించాలని ఆదేశాలు ఇచ్చారు. తాండూర్‌లోని జిల్లా ఆస్పత్రి, వికారాబాద్, పరిగి ప్రాంతీయ ఆస్పత్రుల్లో ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ పరీక్షలు నెలకు 7,500 చేసేలా చర్యలు తీసుకోనున్నారు.

అందుబాటులో ప్రాణవాయువు..

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు చొప్పున ఆక్సిజన్ సిలిండర్లతో పాటు కేంద్రీకృత ప్రాణవాయువు పైపులైన్ వ్యవస్థను, ప్రాణవాయువు ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. తాజాగా కేసులు ప్రబలితే ప్రాణవాయువు కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.



కొవిడ్ సోకిన వారికి అప్పటికే ఇతర వ్యాధులు ఉంటే సమస్య తీవ్రమవుతుంది. శ్వాస సంబంధిత, గుండెపోటు, మధుమేహం వ్యాధులున్న వారికి ఏఎన్ఎంలతో ప్రత్యేక పర్యవేక్షణ చేయించాలని అధికారులు సూచించారు. తాండూరు జిల్లా ఆస్పత్రిలో కేంద్రం ఏర్పాటు

తాండూరు జిల్లా ఆస్పత్రిలో 50 మంచాలతో కొవిడ్ నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేశారు. కొత్త రకం కరోనా కేసులు వ్యాప్తి చెందుతున్నాయనే నేపథ్యంలో వైద్యాధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పరికరాలు అందుబాటులో ఉన్నాయిఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ మూర్తిఆసుపత్రిలో ఆక్సిజన్, కంట్రోలేషన్ పరికరాలు అందుబాటులో ఉంచాం. దగ్గు, జలుబు లక్షణాలతో వచ్చే వారికి ఇక్కడ పరీక్షలు నిర్వహిస్తున్నాం. గురువారం నలుగురికి పరీక్షలు చేస్తే ఎవరికి కరోనా లక్షణాలు కనిపించలేదు. దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

గతం పునరావృతంకాకుండా చర్యలు పల్వన్‌కుమార్, జిల్లా వైద్యాధికారి కరోనా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తల కోసమే ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు గతంలో మాదిరిగా పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అన్ని ఆస్పత్రుల్లో అవసరమైన వసతులు కల్పిస్తున్నాం.

# హాల్ మార్కింగ్ సెంటర్లలో హానికర వాయువులు



హైదరాబాద్ : బంగారు ఆభరణాల హాల్‌మార్కింగ్ ప్రక్రియలో వెలువడే హానికర రసాయనాలతో కాలుష్యం పెరుగుతోంది. సీపీసీబీ నిబంధనలను బేఖాతరు చేస్తున్న కొన్ని సెంటర్ల నిర్వాహకులు వ్యర్థ జలాలను నేరుగా డ్రైనేజీకి అనుసంధానిస్తున్నారు. దీంతో నైట్రస్ ఆక్సైడ్, లెడ్ వంటి హానికర ఉద్గారాలతో పాటు మలినాలు భూమిలోకి చేరుతున్నాయి. అధునాతన కాలుష్య నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, రక్షణ కవచాలను సిబ్బందికి ఇవ్వాలని సూచిస్తున్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదు.సికింద్రాబాద్ మోండా మార్కెట్ సమీపంలో దారి పొడవునా జ్యువెలరీ దుకాణాలున్నాయి. ఇంకొంచెం లోపలికి వెళ్తే ఎత్తయిన పురాతన భవనాల్లో హాల్‌మార్కింగ్ అసేయింగ్ సెంటర్లు కనిపిస్తాయి. బంగారం స్వచ్ఛతతో పాటు హాల్‌మార్కింగ్ చేస్తున్న ఈ కేంద్రాల్లో నిర్వాహకులు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఇరుకైన గదుల్లో, గాలి కూడా చొరబడని ప్రదేశంలో వీటిని ఏర్పాటుచేసి వ్యర్థ జలాలను శుద్ధికోసం పంపకుండా నేరుగా వదిలేస్తున్న సందర్భాలున్నాయి. పనిచేసే సిబ్బంది హానికర వాయువులు పీల్చకుండా తగిన రక్షణ చర్యలూ తీసుకోవడం లేదు. అబిడ్స్, బేగంపేట్ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి.

ప్రక్రియ ఇలా.. తొలుత బంగారు ఆభరణాలు తీసుకున్న తర్వాత స్వచ్ఛత పరిశీలిస్తారు. అనంతరం ఎక్స్‌రే ఫ్లోరోసెన్స్(ఎక్స్ఆర్ఎఫ్) సెక్షన్‌కు పంపుతారు. తర్వాత ఆభరణల్లో లోహాల శాతాన్ని లెక్కిస్తారు. అనంతరం ఫైర్ అసేయింగ్ సెక్షన్‌లో మరోసారి పరీక్షించి, హాల్‌మార్కింగ్ చేస్తారు. ఈ ప్రక్రియలో మెగ్నీషియం, కాల్షియం పాస్పేట్, నైట్రిక్ యాసిడ్, లెడ్ ఫాయిల్, వెండి తదితర లోహాలను వినియోగిస్తారు. అనంతరం క్యుపెల్లేషన్ ప్రక్రియలో భాగంగా ఫర్నేస్‌లో 1100 డిగ్రీల ఉష్ణోగ్రతలో 25 నిముషాలు ఉంచుతారు. తద్వారా లెడ్ ఆక్సైడ్‌తో పాటు ఇతర మలినాలు వాయురూపంలో బయటికొస్తాయి. దీంతో స్వచ్ఛమైన బంగారం వెలికితీస్తారు.

జలకాలుష్యం జరుగుతోందిలా...

ఈ ప్రక్రియలో ప్రతిరోజూ అర లీటరు నైట్రిక్ యాసిడ్‌ను వినియోగిస్తుంటారు. దీంతో పాటు ఒక లీటరు పరిమాణంలో ఆమ్లజలాలు ఉత్పత్తి అవుతుంటాయి. వీటిని 20 నుంచి 25 లీటర్ల పరిమాణంలో ఉండే కంటేయినర్‌లో సేకరించడంతో పాటు వాటి పీహెచ్ విలువను ఎప్పుటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. లిట్మస్ పేపర్, పీహెచ్ మీటర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని నిబంధనలు సూచిస్తున్నాయి. ఇలా సేకరించిన వ్యర్థ జలాలను న్యూట్రలైజేషన్, శుద్ధి చేసిన తర్వాత విడుదల చేయాలని సీపీసీబీ మార్గదర్శకాల సారాంశం. అయితే అనేక చోట్ల ఈ వ్యర్థ జలాలను నేరుగా డ్రైనేజీలోకి వదిలేస్తున్నారు.

నివారణ పరికరాల ఏర్పాటులో అలసత్వం

క్యుపెల్లేషన్ ప్రక్రియలో లెడ్‌ఆక్సైడ్‌లు, నైట్రస్ వాయువులు వెలువడుతుంటాయి. ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నప్పుడు పనిచేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్యం బారినపడే ప్రమాదముంది. దీనిని నివారించేందుకు ప్రత్యేక ‘ఫ్యూమ్ ఎక్‌ట్రాక్షన్’ వ్యవస్థను ఏర్పాటుచేయాలని కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలిచ్చినా పట్టించుకోవడం లేదు. గ్రేటర్ పరిధిలో 40కిపైగా హాల్‌మార్కింగ్, అసేయింగ్ సెంటర్లు ఉండగా, సికింద్రాబాద్, అబిడ్స్‌లోనే సగానికిపైగా ఉన్నాయి. పురాతన భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇరుకైన గదుల్లో, గాలి దూరని ప్రదేశాల్లో ఈ హాల్‌మార్కింగ్ యంత్రాలను ఏర్పాటుచేశారు. ఈ ఫ్యూమ్ ఎక్స్‌ట్రాక్షన్ వ్యవస్థను కూడా ఏర్పాటుచేయకపోవడంతో సిబ్బంది అనారోగ్యం బారిన పడుతున్నారు. పీసీబీ అధికారులు పెద్దగా తనిఖీలు చేయకపోవడంతో నిర్వాహకుల ఇష్టారాజ్యంగా మారిపోయింది.

# అంగన్‌వాడీలు.. అందుబాటులో మరిన్ని సేవలు



తాండూరు: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం విషయంలో ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలి. అంతేకాదు పౌష్టికాహారాన్ని అందించాలి. చిన్నారులను ఆటపాటలతో బడికి ఆకర్షితులయ్యేలా చేయాలి. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీలను ఏర్పాటు చేస్తోంది. వీటిని మరింత బలోపేతం చేసి ‘పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలు’గా మార్చారు. తాజాగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది.

సంఖ్య పెరగడంతో సరిపోని సిబ్బంది

వెయ్యి మంది జనాభా ఉన్న ప్రాంతానికి ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని, అంతకంటే తక్కువ జనాభా ఉన్న దగ్గర ‘మినీ అంగన్‌వాడీ’ కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం జనాభా చిన్నారుల సంఖ్య పెరగడంతో మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలు ఇబ్బందిగా మారుతున్నాయి. ఒక్కరే అంగన్‌వాడీ టీచర్ ఉండటంతో కేంద్రం నిర్వహించడం సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తున్నారు.

కేంద్రాన్ని మూసేయాల్సిన పరిస్థితి

ప్రధాన అంగన్‌వాడీలుగా మినీ కేంద్రాల స్థాయి పెంపుతో లబ్ధిదారులకు మరిన్ని సేవలు అందనున్నాయి. ఇప్పటి వరకు కేవలం ఒక టీచర్ మాత్రమే ఉండటంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించడానికే సమయం సరిపోయేది. పిల్లలతో ఎక్కువ గడిపే అవకాశం రావడం లేదు. ప్రభుత్వం చేపట్టే వివిధ సర్వేలు, కార్యక్రమాల్లో పాల్గొనాలంటే కేంద్రాన్ని మూసి వేయాల్సిన పరిస్థితి. కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడంతో నూతనంగా ఆయా పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంటుంది.

జిల్లాలో వికారాబాద్, మర్పల్లి, పరిగి, కొడంగల్, తాండూరు కేంద్రాలుగా ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వికారాబాద్ పరిధిలో 232, మర్పల్లి 148, పరిగి 213, కొడంగల్ 234, తాండూర్ 279 అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి.

ఉత్తర్వులు వచ్చాయి..

మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నతీకరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయి. అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నూతనంగా ఆయాల పోస్టులు, అదనంగా టీచర్ పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంటుంది.

లలితకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారిణి.

ఇదీ సమగ్ర రూపం

మొత్తం ఐసీడీఎస్ ప్రాజెక్టులు..5

అంగన్‌వాడీ కేంద్రాలు.. 1,106

గర్భిణులు.. 6,315

బాలింతలు.. 5,313

మూడేళ్ల చిన్నారులు..34.429

ఆరేళ్ల చిన్నారులు..18,219

# చలికి జాగారం.. చూపండి కనికరం

హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులు వసతుల లేమితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణలోని జిల్లాలు, సుదూర ప్రాంతాల నుంచి గాంధీ, ఉస్మానియా, ఛాతీ, నిలోఫర్, ఎంఎన్‌జే, నిమ్స్ తదితర ఆసుపత్రులకు చికిత్స నిమిత్తం రోజు వేల సంఖ్యలో రోగులు, వారి బంధువులు వస్తుంటారు. వైద్యులు అందుబాటులో లేకపోవడం, టెస్టు రిపోర్టులు ఆలస్యం.. పడకలు లేకపోవడం..తదితర కారణాలతో రెండు, మూడు రోజులు.. కొన్నిసార్లు వారం, పది రోజుల సమయం కూడా పడుతుంది. దీంతో తిరిగి వెళ్లలేక, ఇక్కడ గదులు అద్దెకు తీసుకొని ఉండే స్తోమత లేక ఆసుపత్రుల ఆవరణలో చెట్లు, షెడ్ల కింద కాలం గడుపుతుంటారు. రాత్రిపూట ఆసుపత్రి ఆవరణలో నేలపై నిద్రిస్తుంటారు. ఉస్మానియా ఆసుపత్రిలో అత్యవసర విభాగం పక్కనే రేకుల షెడ్డు ఉంది. చల్లని గాలితో అక్కడ ఉండలేని పరిస్థితి. నిమ్స్‌తోపాటు ఇతర ఆసుపత్రుల్లో రోగుల సహాయకుల కోసం కొన్ని షెడ్లు ఉన్నాయి. వీటి చుట్టూ అడ్డు లేకపోవడంతో చలిగాలులతో వణుకుతూ గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడు పలువురు తమ సమస్యలను దృష్టికి తీసుకొచ్చి కన్నీళ్లు పెట్టుకున్నారు.చిన్నబాబుతో అర్ధరాత్రి చలిలో..పక్కన చిన్నబాబుతో కనిపిస్తున్న ఈమె పేరు మయూరి. రక్త పరీక్షలు చేయించుకునేందుకు ఆదిలాబాద్ జిల్లా నుంచి గాంధీ ఆసుపత్రికి భర్త, చిన్న పిల్లాడితో వచ్చింది. పరీక్షలు చేసినా ఫలితాలు మాత్రం వస్తాయని చెప్పారు. తిరిగి వెళ్లలేక రాత్రికి ఆసుపత్రి ఆవరణలోని షెడ్డులో నిద్రించారు. చలిలో చిన్నబాబుతో నిద్రించడం ఇబ్బందిగా ఉందని, దోమల సమస్య



ఎక్కువ ఉందని వాపోయారు.

గాంధీ.. మందుబాబులకు అడ్డా!గాంధీ ఆసుపత్రి ప్రాంగణంలోని నైట్ షెడ్లలో మందుబాబులు తిష్ఠ వేస్తున్నారు. పోలీసులు తరచూ గమనిస్తూ మందుబాబుల్ని గుర్తించి బయటకు పంపిస్తున్నా కొద్దిసేపటికి మళ్లీ వస్తున్నారు. జేబు దొంగలు, చిల్లర దొంగలు ఇక్కడ మకాం వేస్తున్నారని, వస్తువులు, డబ్బు దోచుకెళ్తారని ఇతర జిల్లాల నుంచి వారు పేర్కొంటున్నారు. ఇలాంటి వారు రాకుండా పోలీసుల గస్తీ పెంచాలని కోరుతున్నారు.12 గంటలకే ల్యాబ్ మూసివేత: చెస్టు ఆసుపత్రిలో చాలామందికి అదే రోజు టెస్టులు రిపోర్టులు రావడం లేదని, 12 గంటలకే ల్యాబ్ మూత పడుతోందని అడిగితే తర్వాత రోజు రమ్మని చెబుతున్నారని పలువురు రోగులు పేర్కొంటున్నారు. అంతదూరం తిరిగి వెళ్లలేక ఆసుపత్రి, రోడ్లపై చలిలో గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియాలోనూ ఓపీ కోసం అక్కడే చలిలో నిద్రిస్తున్నారు. ఏవైనా ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

# భూ సేకరణకు అడుగులు

మెట్‌పల్లి : జిల్లాలో 63వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి బైపాస్ రహదారి కోసం భూసేకరణకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే రహదారి నిర్మాణ ఆకృతి రూపొందించి భూసేకరణకు వీలుగా అధికారులు నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. రహదారి నిర్మించే ప్రదేశాల్లో ప్రస్తుతం ఎంత మేర భూసేకరణ అవసరం ఉంటుందో అంతవరకు హద్దులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత సర్వే నంబర్ల వారీగా గుర్తించి భూసేకరణకు ముందుకు సాగనున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లా పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు సుమారు 131 కి.మీ మేర నాలుగు వరుసలుతో జాతీయ రహదారి విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లాలో నిర్మించనున్న జాతీయ రహదారి మార్గంలో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి పట్టణాలుండగా, జనావాసాలకు ఇబ్బందులు కలగకుండా మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్లతో పాటు పలు ప్రాంతాల్లో బైపాస్ రహదారి నిర్మాణం చేపట్టేలా ఆకృతిని రూపొందించారు. రహదారి నిర్మాణానికి వ్యవసాయ, ఇతర భూముల మీదుగా సుమారు 31 కి.మీ నిర్ణయించారు. ఇందులో మెట్‌పల్లి మండలంలో సుమారు 14.265 కి.మీ ఉండగా, మండలంలోని మేడిపల్లి వద్ద 55.035 కి.మీ నుంచి మొదలై బండలింగాపూర్, వెల్లుల్ల, చౌలమద్ది, పెద్దాపూర్‌లో 69.300 కి.మీ వరకు బైపాస్ రహదారి నిర్మించాలని నిర్ణయించారు.

రైతుల అభ్యంతరాలు

భూసేకరణ కోసం గతంలో నోటిఫికేషన్ జారీ చేసి అభ్యంతరాలు ఉంటే తెలపాలని అధికారులు రైతులకు సూచించారు. దీంతో విలువైన వ్యవసాయ భూములు నష్టపోతామని రైతులు అభ్యంతరాలు వ్యక్తం



చేశారు. అప్పట్లో జిల్లా అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి భూసేకరణ నిలిపివేయాలని, ఆకృతి మార్చాలని రైతులు విన్నవించారు. మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్లలో కలిపి ఏడు అభ్యంతరాలు వచ్చాయి. వీటిని జాతీయ రహదారి అధికారులకు పంపినట్లు తెలుస్తుండగా, మరోవైపు భూసేకరణకు వీలుగా పనులు మాత్రం కొనసాగుతున్నాయి. 150 అడుగుల వెడల్పుతో..భూసేకరణకు వీలుగా మొదట రహదారి నిర్మాణ స్థలానికి హద్దులు ఏర్పాటు చేస్తున్నారు. 150 అడగుల వెడల్పుతో హద్దులు పెడుతున్నట్లు తెలుస్తోంది. మెట్‌పల్లి మండలంలో 14.265 కి.మీ బైపాస్ రహదారికి గాను సుమారు 57.7689 హెక్టార్ల భూమి అవసరమని గుర్తించారు. హద్దుల నిర్ణయం పూర్తయ్యాక రెండ్రోజుల్లో సర్వే ప్రారంభించి సర్వే నంబర్ల వారీగా భూమిని గుర్తించనున్నారు. ఈ మేరకు సర్వే చేయాలని సర్వేయర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సర్వే పనులు పూర్తయిన తర్వాత భూసేకరణ తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సమాచారం.

సర్వే ప్రారంభిస్తాం- డి.మధు, మెట్‌పల్లి ఆర్డీవో

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ రహదారి కోసం మెట్‌పల్లి మండలంలో జాతీయ రహదారుల సంస్థ హద్దులు ఏర్పాటు చేస్తోంది. అయిదు గ్రామాల మీదుగా సుమారు 14.265 కి.మీ మేర ఈ నిర్మాణం సాగనుంది. హద్దులు పూర్తయిన తర్వాత సర్వే ప్రారంభిస్తాం. సర్వే చేయాలని సర్వేయర్లకు ఆదేశాలు జారీ చేశాం.

# ఆయిల్‌పాం సాగుకు చర్యలు

పెద్దపల్లి : జిల్లాలో ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచేందుకు ఉద్యానవన శాఖ ప్రణాళికలు రూపొందించింది. వరి కోతలు ముగియడంతో అన్నదాతను ఆయిల్‌పాం వైపు మళ్లించేందుకు చర్యలు చేపట్టింది. సాగుకు ముందుకొస్తున్న రైతుల నుంచి డీడీలు స్వీకరిస్తుంది. రెండేళ్లుగా జిల్లాలో ఆయిల్‌పాం సాగు లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ, ఉద్యన శాఖలు భాగస్వామ్యంతో ముందుకెళ్తున్నాయి. క్షేత్ర స్థాయిలో అధికారులు చైతన్య పర్చడంతో రైతులు ఉత్సాహం చూపుతున్నారు.

సాగులో సందేహాలు తొలగింపు

జిల్లా వ్యాప్తంగా 50 క్లస్టర్ల పరిధిలో.. ఒక్కో క్లస్టర్‌లో 200 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు కోసం ఉద్యానవన, వ్యవసాయ అధికారులు సన్నద్ధమవుతున్నారు. గ్రామసభలు, రైతు వేదికల్లో ఈ పంట సాగులోని సందేహాలను తొలగిస్తున్నారు. ఈ పంట సాగులో ఎస్సీ, ఎస్టీ రైతులకు



పూర్తిగా, ఇతర వర్గాలకు 90 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నారు. నాలుగేళ్లు.. ఏడాదికి రూ. 4,200 చొప్పున పంట పెట్టుబడి మంజూరు కానుండటంతో రైతులు ఆసక్తిచూపుతున్నారు.

వాతావరణం అనుకూలమే

ఏళ్ల తరబడి ఒకే రకమైన పంట సాగు చేయడంతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులు ఆధునిక పద్ధతి వైపు అడుగులు వేస్తున్నారు. ఆయిల్‌పాం సాగుపై ఇక్కడి నేలలు, వాతావరణం అనుకూలమేనా అనే బెంగ చాలా మంది రైతుల్లో ఉంది. రెండేళ్ల క్రితం సాగు చేసిన మొక్కలకు గెలలు కూడా వచ్చాయి. మూడేళ్లు నిండితే తప్ప ఈ గెలలు పనికిరావు. దీంతో అధికారుల సూచనలతో గెలలను తొలగిస్తున్నారు. జిల్లాలో ఆయిల్‌పాం పరిశ్రమ నెలకొల్పుతామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో భరోసా కలుగుతోంది.

1,333.34 ఎకరాలకు డీడీలు

జిల్లాలో వరి, పత్తి, కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. 2022లో ఆయిల్‌పాం సాగుకు శ్రీకారం చుట్టారు. రెండేళ్లలో 2,266 ఎకరాల్లో సాగు చేశారు. ఈ యాసంగిలో 1,333.34 ఎకరాల్లో సాగు చేసేందుకు 496 మంది రైతులు డీడీలు చెల్లించారు. ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వరి కోతలు పూర్తికావడంతో యాసంగిలో ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచాలని అధికారులు భావిస్తున్నారు.

# కట్ట రోడ్డుపై ప్రయాణం కష్టమే!

ఆత్మకూరు : ఆత్మకూరు పరమేశ్వరస్వామి చెరువు కట్ట ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆత్మకూరు నుంచి జాతీయ రహదారికి చేరాలన్నా, చిన్నచింతకుంట, అమ్మాపురం గ్రామాల మీదుగా మహబూబ్‌నగర్‌కు వెళ్లాలన్నా విధిగా ఈ చెరువుకట్టపై ప్రయాణించాల్సిందే. ఆరు మలుపులు.. మూడు వంపులతో ఉన్న ఈ చెరువు కట్టతో పాటు కొత్తకోట, అల్లీపురం గ్రామాల వైపు ఉన్న రహదారులను అభివృద్ధి చేసేందుకు రహదారులు, భవనాల శాఖ రూ.502 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టింది. రహదారుల అభివృద్ధి పనులను మంజూరు చేసిన ఆర్‌అండ్‌బీ శాఖ చెరువుకట్టపై రక్షణ చర్యలను విస్మరించింది. ఇప్పటికే చెరువు కట్టపై రహదారి అభివృద్ధి పనులను పూర్తి చేశారు. పరమేశ్వరస్వామి చెరువులో ఏడాది పొడవునా నీరు నిలిచి ఉంటుంది.



ఇలాంటి పరిస్థితుల్లో నిల్వ నీరు ఉండే వైపు రక్షణగోడ నిర్మించే పనులు చేపట్టలేదు. చెరువు కట్ట దిగువన ఆయకట్టు పొలాలు 20 ఫీట్ల లోతులో ఉంటాయి. కట్టపై ప్రమాదం జరిగితే వాహనాలు చెరువులో పడిపోవడమో, చెరువు ఆయకట్ట దిగువకు అదుపుతప్పడమో జరుగుతోంది. కట్టపై రాకపోకలు సాగించే వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించకపోవడం వల్ల ప్రమాదాల ప్రభావ తీవ్రత ఎక్కువగా ఉంటోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కట్టపై రక్షణ గోడల నిర్మాణం, ప్రమాద హెచ్చరికలను ఏర్పాటు చేసే అంశాన్ని ఆర్‌అండ్‌బీ ఏఈ నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా ప్రస్తుతం మంజూరైన పనుల్లో రక్షణగోడల నిర్మాణం, ప్రమాద హెచ్చరికలను చేర్చలేదని, జరుగుతున్న పనులు పూర్తి అయిన అనంతరం తిరిగి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపుతామని పేర్కొన్నారు. చెరువు కట్ట పురపాలిక పరిధిలో ఉన్న క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని పాలకవర్గాన్ని సూచించామని ఆయన వివరించారు.

# కట్టు దిట్టం

సిద్దిపేట : ఎన్నికలు సజావుగా సాగాలంటే.. అన్ని దశల్లో పటిష్ఠ నిఘా వ్యవస్థ అవశ్యం. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ పూర్తి చేసేందుకు ముందు నుంచి కీలక బాధ్యత వహించే పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. గత సంఘటనలు, అనుభవాల దృష్ట్యా పునరావృతం కాకుండా దృష్టి సారిస్తారు. నవంబరు 30న పోలింగ్ నేపథ్యంలో జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తున్నారు. ఆయా చోట్ల స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలు మోహరించనున్నాయి. వెబ్‌క్యాస్టింగ్ వంటి అంశాలు దోహదం చేయనున్నాయి.

ముమ్మరంగా తనిఖీలు

జిల్లాలో పోలీసు కమిషనరేట్ పరిధిలో 26 పోలీసు ఠాణాలు ఉన్నాయి. జిల్లా పరిధిలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 1151. ఇప్పటి వరకు సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ ప్రాంతాల్లో సుమారు 454 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఆయా పరిధిలో గత సంఘటనలను షెడ్యూల్ వెలువడేందుకు ముందు నుంచి పరిగణనలోకి తీసుకొని వివరాలు సేకరించారు. గత ఎన్నికల్లో కేంద్రాల వద్ద గొడవలు చోటుచేసుకోవడం, పార్టీల శ్రేణులు పరస్పర దాడులకు దిగడం, అనుకోని సంఘటనల అంశాల ప్రాతిపదికన సమస్యాత్మకంగా ధ్రువీకరించారు. ఈ నెల 9న షెడ్యూల్ వెలువడిన వెంటనే నిబంధనావళి అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో జిల్లా సరిహద్దులు, ముఖ్య ప్రాంతాల్లో పది చెక్‌పోస్టులు అందుబాటులోకి తేగా ముమ్మర వాహన తనిఖీలు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సరఫరా చేసే సొమ్మును స్వాధీనం చేసుకుంటున్నారు. నియోజకవర్గం, మండల కేంద్రాలు, ప్రధాన రహదారుల వద్ద కేంద్ర బలగాల సహకారంతో పోలీసులు ఆకస్మికంగా పరిశీలనలు చేస్తున్నారు. మద్యం గొలుసు దుకాణాలపై దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. పాత నేరస్థులు, అనుమానితులను బైండోవరు చేస్తున్నారు.

కవాతుతో భరోసా

జిల్లాలో వివిధ స్థాయిల్లో సుమారు 1400 మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. శాసన సమరం నేపథ్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి జిల్లాకు కేంద్ర బలగాల రాకమొదలైంది. ఇప్పటి వరకు మూడు కంపెనీలు చేరాయి. అందులో ఒక ఎస్ఎస్‌బీ, రెండు బీఎస్ఎఫ్ బలగాలు ఉన్నాయి. దాదాపు 250 మందికి పైగా బలగాల సిబ్బంది చేరుకున్నారు. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ మొదలెట్టారు. తద్వారా ప్రశాంత వాతావరణంలో, ధైర్యంగా ఓటు వేయొచ్చనే సందేశాన్ని ఇస్తున్నారు. నాలుగు నియోజకవర్గాలకు ఆయా బలగాలను విభజించారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా మరిన్ని బలగాలు రంగంలోకి దిగే అవకాశం ఉంది. పోలీసుల నేతృత్వంలో ఈవీఎం, వీవీప్యాట్, స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత వహించనున్నారు.

మరికొన్ని రానున్నాయి!

ఒక కంపెనీలో 75 మంది చొప్పున ఇప్పటికే జిల్లాకు రెండు కంపెనీల బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్), ఒక కంపెనీ ఎస్ఎస్‌బిఎల్ (సశస్త్ర సీమా బల్) సిబ్బంది జిల్లాకు చేరుకున్నారు. ఈ 3 కంపెనీల బలగాలు ఒక్కో కంపెనీ చొప్పున సిద్దిపేట, గజ్వేల్ హుస్నాబాద్‌లో ఇప్పటికే మోహరించి స్థానిక సిబ్బందితో కలసి విధుల్లో నిమగ్నమవుతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం గతంతో పోలిస్తే ఈసారి ఎక్కువగా కేంద్ర బలగాల కంపెనీలను రాష్ట్రానికి పంపిస్తోంది. ఇంకా మరికొన్ని కంపెనీల బలగాలు రానున్నాయి.

సామాజిక మాధ్యమాలపై నజర్

సామాజిక మాధ్యమాలపై పోలీసు శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ మేరకు పోలీసు కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక సోషల్ మీడియా విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. అసభ్యకర చిత్రాలు, దృశ్యాలు, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, అశాంతి, అలజడి రేపేలా సందేశాలు పెట్టే వారిపై నిఘా సారించారు. ఎవరైనా ఆ దిశగా తప్పుడు సందేశాలు పోస్టు చేస్తే కంట్రోల్ రూం వాట్సాప్ నం. 87126 67100 ఫిర్యాదు చేయొచ్చు. వివరాలు గోప్యంగా ఉంటాయి. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసులు సూచిస్తున్నారు.

# యూడైస్‌లో పేరుంటేనే ఏకరూప దుస్తులు



అచ్చంపేట : విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పలుమార్లు ఆదేశాలు జారీ చేసినా ఇప్పటికీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ నెల 28లోగా విద్యార్థుల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా అధికారులకు విద్యాశాఖ సంచాలకురాలు ఆదేశాలు జారీ చేశారు. తుది గడువులోగా పోర్టల్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగానే 2024-25 విద్యా సంవత్సరంలో పిల్లలకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేయనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా విద్యాశాఖ శ్రద్ధ తీసుకుంటోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 3,230 పాఠశాలల్లో 3,58,807 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టంఫర్ ఎడ్యుకేషన్) పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ప్రతి పాఠశాలలో చదువుతున్న వారి వివరాలను ఇందులో నమోదు చేయాలి. గతంలో నమోదై ఉన్న విద్యార్థుల వివరాలను అప్‌డేట్ చేయాలి. పాఠశాల నుంచి వెళ్లిపోయిన వారిని తొలగించి కొత్తగా చేరిన వారి సమాచారాన్ని పొందుపర్చాలి. నమోదుకు గడువు సమీపిస్తుండటంతో పాఠశాలల హెచ్ఎంలపై విద్యాశాఖ అధికారులు ఒత్తిడిని పెంచుతున్నారు. పోర్టల్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంక్షేమ పథకాలు అందనున్నాయి.

గడువులోగా పూర్తి చేయాలి: అన్ని పాఠశాలల హెచ్ఎంలు విద్యార్థుల పూర్తి వివరాలను యూడైస్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను విధిగా ఈ నెల 28లోగా పూర్తి చేయాలి. ఇప్పటికే చాలాసార్లు ఈ విషయమై సమాచారం ఇచ్చాం. పాఠశాల విద్యాశాఖ సంచాలకురాలు తుది గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 28 తర్వాత నమోదు చేసేందుకు అవకాశం ఉండదు. పోర్టల్‌లో వివరాల నమోదుతో పాటు ముఖ గుర్తింపు హాజరు నమోదు కోసం పాఠశాలలకు అందజేసిన ట్యాబుల్లో విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి.డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూలు

# గద్వాల ఆసుపత్రికి ఆధునిక యంత్రం



గద్వాల : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు మరో అత్యాధునిక పరికరం అందుబాటులోకి రానుంది. వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆదేశాల మేరకు రక్తంలో ప్లాస్మా, ప్లేట్లెట్స్, రక్త కణాలు వేరు చేసేందుకు ఉపయోగపడే ఎఫరెసిస్ యంత్రాన్ని గద్వాల ఆసుపత్రికి తెప్పించారు. ఈ మిషన్‌తో రక్త సేకరణ సులభతరం కానుంది. రక్తంలో అవసరమైన దాన్ని మాత్రమే తీసుకునే వెసులుబాటు ఇందులో ఉంటుంది.

ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.15 వేల ఖర్చు: రక్తంలో సింగిల్ డోనర్ ప్లేట్లెట్స(ఎస్‌డీపీ) వేరు చేసేందుకు ఉపయోగపడే ఈ యంత్రాన్ని రూ.37 లక్షల వెచ్చించి కొనుగోలు చేశారు. సాధారణంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎస్‌డీపీ చేసేందుకు రూ.15 వేల వరకు ఖర్చు వస్తుంది. ఈ ప్రక్రియకు అవసరమైన ఒక్కో కిట్ ధరనే రూ.11 వేలు. కాగా ఇతర సర్వీస్ ఛార్జీలు మరో రూ.4వేల వరకు అదనంగా వసూలు చేస్తారు. ఇంత విలువైన చికిత్సను గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో అందించేందుకు ఆవరణలోనే ఉన్న బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే రిసెప్షన్ కౌంటర్ సిద్ధమవగా త్వరలోనే ఎస్‌డీపీ సేవలను అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

ఏం చేస్తుంది

రక్తంలో సాధారణంగా ప్లాస్మా, ప్లేట్‌లెట్స్, తెల్లరక్త కణాలు, ఎర్ర రక్త కణాలు ఉంటాయి. ఇప్పటి వరకు సాధారణంగా దాత నుంచి రక్తాన్ని తీసుకుని అవసరమైన వారికి ఎక్కిస్తున్నారు. ఈ యంత్ర ద్వారా రక్తంలో అవసరమైన భాగాన్ని విడిగా తీసుకునే అవకాశముంటుంది. ప్లేట్‌లెట్స్ మాత్రమే కావాలనుకున్నప్పుడు దాత నుంచి ప్లేట్‌లెట్స్ మాత్రమే తీసుకుని, మిగిలిన రక్తాన్ని తిరిగి దాతకు ఈ ఎస్‌డీప్మీ విధానంలో ఎక్కించేందుకు అవకాశముంది. ప్రస్తుతం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్‌డీపీ చికిత్సకు ప్రస్తుతానికి పది కిట్లు రాగా, నెల రోజుల్లోగా ఈ యంత్రంతో రోగులకు వైద్య సేవలు ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఎఫరెసిస్ యంత్రం ఏర్పాటుకు నిబంధనల ప్రకారం కావాల్సిన మౌలిక సదుపాయాలను బ్లడ్ బ్యాంక్‌లో కల్పించాక, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు లైసెన్స్‌కు దరఖాస్తు చేయడం జరుగుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి

యంత్రంను వినియోగించేందుకు లైసెన్స్ రాగానే ఆయా రోగాలకు వైద్యుల సూచనమేరకు ఎస్‌డీపీ విధానాన్ని అవలంబిస్తాం. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఎంతో విలువైన ఎస్‌డీపీ చికిత్సను అందిస్తున్నందున రోగులు సద్వినియోగం చేసుకోవాలి. పది కిట్లు అయిపోతే మరిన్ని కిట్లు తెప్పించి అవసరమైన రోగులందరికీ ఎస్‌డీపీ చికిత్సను అందజేస్తాం. యంత్రం ఆపరేట్ చేసేందుకు బ్లడ్ బ్యాంక్ సిబ్బందికి త్వరలోనే నిపుణులతో శిక్షణ ఇప్పించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఓ కౌన్సిలర్ కూడా అవసరమున్నందున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.నవీన్‌క్రాంతి, బ్లడ్ బ్యాంక్ మెడికల్ అధికారి, గద్వాల

# హస్తకళా నైపుణ్యంపై శిక్షణ.. భవితకు రక్షణ


గంభీరావుపేట : విద్యతోపాటు స్వయం ఉపాధి రంగంలో విద్యార్థినులు రాణించడానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో హస్తకళా నైపుణ్యంపై శిక్షణ అందిస్తున్నారు. రెండు నెలల పాటు రోజూ గంట సేపు శిక్షకురాలు నేర్పిస్తున్నారు. ఇప్పటి వరకు 17 రోజుల కోర్సు పూర్తి చేసుకున్నారు. భవిష్యత్తులో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. విద్యార్థినులు కూడా ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. హస్తకళా నైపుణ్యంలో దారంతో తయారు చేసే జ్యూవెల్లరితో పాటు ఇయర్ రింగ్స్, గాజులు, క్రాఫ్ట్‌కు సంబంధించి పేపర్ ఫ్లవర్స్, బొకేలను నేర్పిస్తున్నారు. దారంతో తయారు చేసిన వీటికి మార్కెట్‌లో చాలా ధర పలుకుతుంది. దీంతో విద్యార్థినులు కూడా నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. రెండు నెలల్లో పూర్తి స్థాయిలో నేర్చుకున్న అనంతరం వారికి సర్టిఫికెట్ అందజేస్తారు. దీంతో వారు స్వయం ఉపాధి కోసం బ్యాంకులో రుణం తీసుకుని దుకాణం పెట్టుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధికి ఉపయోగపడే అనేక కోర్సులను నేర్పిస్తున్నారు. చదువు ఒక్కటే కాకుండా భవిష్యత్తులో ఎవరిపై ఆధారపడకుండా ఉండేందుకు ఉపాధి కోర్సులను అందిస్తున్నారు. ఇటీవల బ్యూటీషన్ కోర్సును సైతం అందించారు.

నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది – చందన, తృతీయ డిగ్రీ

ఉపాధి అవకాశాల కోసం మా డిగ్రీ కళాశాలలో చాలా నేర్పిస్తున్నారు. హస్తకళా కోర్సును సైతం అందిస్తున్నారు. చాలా ఆసక్తిగా నేర్చుకుంటున్నాను. మహిళల ఆభరణాలకు సంబంధించిన కోర్సు కావడంతో భవిష్యత్తులో దీని అవసరాలు చాలా ఉంటాయి.

ప్రోత్సహిస్తున్నాం– వాణి, శిక్షకురాలు

నేర్చుకోవాలనే తపన ఉన్నవారిని ప్రోత్సహించి హస్తకళా నైపుణ్యంలో శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థినులు ఆసక్తి కనబరుస్తున్నారు. మార్కెట్లో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో చాలా మంది ముందుకు వస్తున్నారు.



చాలా ఉపయోగం– శృతిజ, డిగ్రీ తృతీయ సంవత్సరం

జ్యూవెల్లర్లితో పాటు గాజులు, ఇయర్ రింగ్స్ నేర్పిస్తున్నారు. ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. సర్టిఫికెట్ కోర్సు కావడంతో చాలా ఆసక్తిగా నేర్చుకుంటున్నాను. భవిష్యత్తులో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మాకు విద్యతో పాటు ఉపాధి కోర్సులను డిగ్రీ కళాశాలలో అందించటం చాలా సంతోషంగా ఉంది.

సద్వినియోగం చేసుకుంటున్నారు– విజయలక్ష్మి, ప్రిన్సిపల్

మా కళాశాలలో చాలా మంది విద్యార్థినులకు భవిష్యత్తులో ఉపాధి పొందటం కోసం ఉపాధి సర్టిఫికెట్ కోర్సులను నేర్పించటం జరుగుతుంది. ఇటీవల బ్యూటీషన్ కోర్సును సైతం నేర్పించాం. ప్రస్తుతం హస్తకళా నైపుణ్యంపై శిక్షణ అందిస్తున్నాం. చాలా మంది సద్వినియోగం చేసుకుంటున్నారు. మా కళాశాలలో ఉద్యోగ మేళాలను సైతం నిర్వహిస్తున్నారు.

# పొదుపు సంఘం.. చైతన్య పథం

సంగారెడ్డి : ఇది ఎన్నికల సమయం. ఓటును ఆయుధంగా చేసుకొని భవితను నిర్దేశించుకునే తరుణం. ఓటరు నమోదు, సద్వినియోగం అంశాలకు ప్రాధాన్యం ఇవ్వపోతే ఐదేళ్లు అవస్థలు పడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఓటరు చైతన్యానికి జిల్లా యంత్రాంగం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో మహిళా సంఘాల సభ్యులనూ భాగస్వామ్యం చేసిన నేపథ్యంలో కథనం.

ప్రధాన ఎజెండాగా..

ప్రతినెలా మహిళా సభ్యులు సమావేశం నిర్వహిస్తుంటారు. గ్రామంలోని అన్ని సంఘాల ప్రతినిధులు కలిపి గ్రామైక్య సంఘం సమావేశాలు సైతం ఏర్పాటు చేస్తారు. పొదుపులు, అప్పులు, రుణ వాయిదాల చెల్లింపులు, మహిళల సమస్యలపై చర్చిస్తుంటారు. ఇది ఎన్నికల సమయంలో అర్హులందరూ ఓటర్లుగా నమోదు, ఓటు హక్కు కలిగిన వారంతా ఓటింగ్‌లో పాల్గొనేలా చైతన్యం తీసుకువచ్చే అంశాలను గ్రామైక్య సంఘం సమావేశంలో ప్రధాన ఎజెండాగా చేర్చారు.

సమర్థులనే ఎన్నుకోవాలని..



ఓటు హక్కు వినియోగించుకోవడం, ప్రలోభాలకు లొంగకుండా సమర్థులనే ఎన్నుకోవడం.. తద్వారా కలిగే ప్రయోజనాలపై చర్చిస్తున్నారు. నగదు, మద్యం, బహుమతులకు ఆశపడితే ఐదేళ్ల భవిష్యత్తును తాకట్టు పెట్టినట్టేటనని తోటి మహిళలకు తెలిసేలా ప్రచారం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఐదింట రెండు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉండటంతో తమ అభ్యున్నతికి బాటలు వేసే వారికే విజయం కట్టబెట్టేలా మండల, గ్రామైక్య సంఘాల సమావేశాల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. గ్రామంలో అర్హులు ఎవరైనా ఇప్పటికీ ఓటరుగా నమోదు కాకపోతే నమోదు చేయించడం, ఓటు హక్కు ఉన్న వారంతా నిజాయితీగా వినియోగించుకోవాలని పొదుపు సంఘాల సభ్యులకు సూచిస్తున్నారు. ప్రతి ఇంటికీ సమాచారం చేరవేసినట్లు అవుతుందని జిల్లా యంత్రాంగం భావిస్తోంది.

# కిక్కు లేదు..!

సంగారెడ్డి :: జిల్లా లో మద్యం విక్రయాలు తగ్గాయి. గత దసరాతో పోలిస్తే ఈ ఏడాది పండుగ సీజన్ అంతంత మాత్రమే కన్పించింది. జిల్లాలో మూడు ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో 59 వైన్స్‌షాపులు, 9 బార్‌అండ్‌రెస్టారెంట్‌లో దసరా పం డుగను పురస్కరించుకుని మూడ్రోజుల విక్రయాలను చూస్తే ఆశించినంతగా మద్యం అమ్మకాలు జరుగలేదు.గతేడాది దసరా పండుగ మూడ్రోజుల్లో రూ.5.63 కోట్ల ఆదాయం రాగా, ఈ సారి రూ.5.11 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. అంటే సుమారు రూ.52 లక్షల మద్యం విక్రయాలు తగ్గాయి. ఈ ఏడాది బీర్ల కేసుల హవా కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 4,696 ఐఎంఎల్ కేసులు విక్రయించగా, 8,948 బీర్ల కేసులు అమ్మకాలు జరిగాయి.

ఎన్నికల కోడ్‌నే కారణమా?జిల్లాలోని మూడు ఎక్సైజ్‌స్టేషన్‌ల పరిధిలో గతేడాది కంటే ఈ ఏడాది మద్యం విక్రయాలు ఆశించినస్థాయి కంటే తక్కువగా జరిగాయి. గతేడాది దసరా పండుగను పురస్కరించుకుని మూడ్రోజుల్లో రూ.5.63 కోట్లు మద్యం విక్రయాలు జరుగగా ఈ ఏడాది రూ.5. 11 కోట్లు అమ్మకాలు మాత్రమే జరిగాయి. దీంతో సుమారు రూ.52 లక్షల వరకు విక్రయాలు తగ్గాయి. మరోనెల రోజుల్లో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆ ప్రభావంతోనే మద్యం విక్రయాలు తగ్గి ఉం డవచ్చని సమాచారం. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే జిల్లాలో గ్రామాల్లోని బెల్టుషాపులపై సివిల్ పోలీసులు దాడులు చేస్తూ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. దీంతో పండుగ సీజన్‌లో కూడ బెల్టుషాపుల్లో మద్యం జరుగక పోవడంతో ఈ ఏడాది మద్యం అమ్మకాలు కాస్త తగ్గాయి.

మూడ్రోజుల్లో రూ.5.11 కోట్ల మద్యం అమ్మకాలు..

మహబూబాబాద్ జిల్లాలో గతేడాది మద్యం విక్రయాల ద్వారా 5.63 కోట్లు ఆదాయం రాగా, ఈ ఏడాది దసరా పండుగను పురస్కరించుకుని మూడ్రోజుల్లో రూ.5.11 కోట్ల అమ్మకాలు జరిగాయి. ఈ నెల 22, 23, 24 తేదీల్లో మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 27 వైన్స్ షాపులు, 5 బార్ షాపుల్లో 2005 మద్యం కేసులు అమ్మకాలు జరుగగా 3,753 బీరు బాక్సులు విక్రయాలు జరిగాయి. వీటి ద్వారా రూ.2.10 కోట్ల ఆదాయం వచ్చింది.

తొర్రూరు స్టేషన్ పరిధిలో 21 వైన్స్ షాపులు, 4 బార్ అండ్ రెస్టారెంట్ల ద్వారా 1,610 మద్యం కేసులు, 2,953 బీర్ కేసులు అమ్మకాలు జరిగాయి. వీటి ద్వారా రూ.1.80 లక్షల ఆదాయం వచ్చింది. గూడూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 11 వైన్స్ షాపుల్లో 1084 మద్యం కేసులు, 2242 బీర్ కేసులు అమ్మకాలు జరుగగా వీటి ద్వారా రూ.1.19 కోట్ల ఆదాయం సమకూరింది. వెరసి జిల్లా వ్యాప్తంగా 59 వైన్స్‌లు, 9 బార్ల షాపుల ద్వారా 4699 మద్యం కేసులు, 8948 బీరు బాక్సులు అమ్మకాలు జరిగాయి. వీటి ద్వారా రూ. 5.11 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది దసరా పండగను పురస్కరించుకుని పది రోజుల్లో జిల్లా వ్యాప్తంగా మద్యం విక్రయాల ద్వారా రూ.25 కోట్లు రాగా, ఈ సారి రూ.17.98 కోట్ల ఆదాయం సమకూరింది.

# ప్రజా భద్రతలో మేటి.. పోలీస్ కమాండ్ కంట్రోల్


హైదరాబాద్: అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమం ఆడిట్ ఆఫ్ ఈ–గవర్నెన్స్‌లో భాగంగా 25 దేశాలకు చెందిన 37మంది ప్రతినిధులు బంజారాహిల్స్‌లోని పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతల నిర్వహణ, పోలీసు కార్యాలపాలు, సాంకేతికత పరిజ్ఞానం, పరిపాలన, సీసీ కెమెరాలు, వార్‌రూమ్ తదితర అంశాలపై సాంకేతిక విభాగ ఎస్పీ పుష్ప వివరించారు. ప్రకృతి విపత్తుల్లో సత్వరమే స్పందించే తీరుపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో వెల్లడించారు. సంయుక్త సీపీ పరిమళ హరనూనత్, అడ్మిన్ ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 'వాడీవేడీ చర్చలో ఉన్నా.. నవ్వులు పూయించగలరు': వాజ్‌పేయీ జయంతి వేళ మోదీ నివాళి

దిల్లీ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ 99వ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీనివాళులు అర్పించారు. సోమవారం దిల్లీలోని రాష్ట్రీయ స్మృతి స్థల్ సమీపంలో నిర్మించిన సదైవ్ అటల్‌ను సందర్శించారు. మాతృభూమి పట్ల వాజ్‌పేయీ చూపిన అంకితభావం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి అని మోదీ కొనియాడారు. ఈ దేశ నిర్మాణాన్ని వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. అలాగే వాజ్‌పేయీ జీవితంలోని వివిధ ఘట్టాల సమాహారంగా ఉన్న వీడియోను మోదీ ట్విటర్ వేదికగా షేర్ చేశారు. ఆ వీడియోకు మోదీ గళం అందించారు. 'దేనిలోనైనా హాస్యాన్ని వెతకగల సామర్థ్యం వాజ్‌పేయీ సొంతం. పార్టీ సమావేశాల్లో వాతావారణం వేడెక్కుతున్న సమయంలో.. ఒక జోక్ పేల్చి నవ్వులు పూయించేవారు. ఆయనకు ప్రతి విషయంపై అవగాహన ఉండేది' అని మోదీ ప్రశంసించారు.

**క్రీస్తు బోధనలను స్మరించుకుందాం: మోదీ –** క్రిస్మస్ పర్వదినం రోజు దేశ ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభాగ్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. 'క్రిస్మస్‌కు చిహ్నాలైన దయ, కరుణను గుర్తుచేస్తుకుందాం. ఈ రోజున క్రీస్తు బోధనలను స్మరించుకుందాం' అని మోదీ తన ట్విటర్ ఖాతాలో రాసుకొచ్చారు.




బాపట్ల: పర్చూరులో వైకాపా నుంచి తాను పోటీ చేసి గెలవకపోవడమే మంచిదైందని దగ్గుబాటి వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. గెలిచి ఉంటే.. రోడ్లు వేయలేదని ప్రజలు తనని నిలదీసేవారన్నారు. కారంచేడులో స్థానికులతో ఆయన మాటామంతీ నిర్వహించారు. వైకాపా పాలనలో కారంచేడులో ఒక్క రోడ్డు మరమ్మతు కూడా చేయలేదు. ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే ఈ రోడ్లపై ఇంత స్వేచ్ఛగా తిరిగే వాడిని కాదు. దేవుడి దయ వల్ల పర్చూరులో నేను ఓడిపోవడం మంచిదైంది. నా కుమారుడిని ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇస్తామన్నారు. జగన్ పెట్టిన నిబంధనలకు తలొగ్గలేక సున్నితంగా తిరస్కరించాం. ఇవాళ రాజకీయాలంటే పరస్పర విమర్శలు.

నేతలు తిట్టుకోవడమే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదు

**– దగ్గుబాటి వెంకటేశ్వరరావు**

## తమిళనాడులో ఈడీ అధికారులపై కేసు నమోదు




చెన్నై: తమిళనాడు పోలీసులు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులపై కేసు నమోదు చేశారు. ఈడీ అధికారులు తమ విధులకు ఆటంకం కలిగించారంటూ డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ (డీవీఏసీ) అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకొన్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని మదురైలో ఈడీ అధికారిగా పని చేస్తున్న అంకిత్ తివారీని లంచం కేసులో ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా డీవీఏసీ అధికారులు తనిఖీల నిమిత్తం స్థానిక ఈడీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సోదాలు చేస్తున్న సమయంలో ఈడీ అధికారులు తమను అడ్డుకున్నారని డీవీఏసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈడీ అధికారులపై మదురై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. నిందితుడైన ఈడీ అధికారి అంకిత్ తివారీ ఓ ప్రభుత్వ అధికారి ఆస్తులకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా తొలుత రూ.3 కోట్లు డిమాండ్ చేశాడు. ఆ తర్వాత రూ.51 లక్షలైనా ఇవ్వాలన్నాడు. చివరికి ఒప్పందంలో భాగంగా రూ.20 లక్షల లంచం తీసుకుంటుండగా.. అంకిత్‌ను డీవీఏసీ అధికారులు పట్టుకున్నారు.

## కక్షపూరిత రాజకీయాలతో జగన్ ప్రభుత్వం కాలం వెళ్లబుచ్చుతోంది



అమరావతి: కక్షపూరిత రాజకీయాలతో జగన్ ప్రభుత్వం కాలం వెళ్లబుచ్చుతోందని తెలుగుదేశం పార్టీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ వ్యాఖ్యానించారు. సోమవారం నాడు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... "రాష్ట్రంలో ప్రజాధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోంది. ప్రభుత్వ స్కీముల పేరుతో స్కాములకు పాల్పడుతోంది. పార్టీ కార్యక్రమాలకు ప్రభుత్వ ధనాన్ని వినియోగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం, జగన్ పాలనా వైఫల్యాలు అడుగడుగునా కనబడుతున్నాయి. రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన ప్రభుత్వం వెనక్కి తీసుకెళ్తోంది. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించడం తప్ప అభివృద్ధి శూన్యం. ప్రభుత్వం ప్రజాస్వామిక, ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోంది. ప్రభుత్వ లోపాలు ఎత్తిచూపితే, అవినీతిని ప్రశ్నిస్తే కక్షగట్టి కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారు. పరిశ్రమలు రాకుండా పారిశ్రామికులను భయపెట్టి పలాయనం చిత్తగించేలా చేశారు. జాకీ, లూలూ, రిలయన్స్, డేటా సెంటర్, అమర్ రాజా బ్యాటర్ కంపెనీలు ఏపీలో క్లోజ్ అయ్యాయి. దాదాపు 2 లక్షల ఉద్యోగస్తులు రోడ్ల పాలయ్యారు. రాష్ట్రంలో నిరుద్యోగిత రేటు 24 శాతం ఉంది. రాష్ట్రంలో రోజుకొక నిరుద్యోగి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. రాజకీయాల పరంగా ప్రతిపక్ష నాయకుల ఆస్తులను వైసీపీ నేతలు ధ్వంసం చేస్తున్నారు" అని ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు.




విశాఖపట్నం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ని ప్రజాశాంతి పార్టీలోకి ఆహ్వానించామని.. ఆయన మా పార్టీలోకి వస్తే.. ఏపీకి సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తానని ఆ పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వ్యాఖ్యానించారు. సోమవారం నాడు తన కార్యాలయంలో కేఏ పాల్ మీడియాతో మాట్లాడుతూ..."తెలంగాణ నుంచి జన సేనను తరిమేశారు. పవన్ కళ్యాణ్ మాతో పొత్తుకు రావాలి. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 14 ఏళ్లలో అవినీతి పాలన , ప్రత్యేక ప్యాకేజీ, హోదా సాధించలేక పోయారు. 200 దేశాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రెండు వేల సంవత్సరాల తర్వాత మళ్లీ వస్తానని ఏసు క్రీస్తు చెప్పారు. చాలా మందికి ఇప్పటికీ మేరీ క్రిస్మస్ అంటే ఏమిటో అర్థం తెలియదు. ఏసు క్రీస్తు తర్వాత ఇలాంటి రక్షకుడు పుట్టలేదు. లోకం అంతా స్వార్థం, పాపం పెరిగిపోయింది.

క్రిస్మస్ సందర్భంగా నిరాశ్రయులకు, ఆహారం దుప్పట్లు పంపిణీ చేశాం" అని కేఏ పాల్ తెలిపారు.




## పొగమంచు ప్రభావం.. విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం


దేశ రాజధాని దిల్లీ సహా పలు రాష్ట్రాలను పొగమంచు కమ్మేసింది. దిల్లీలో ఉష్ణోగ్రత 9.4 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఈ కారణంగా రహదారిపై ప్రయాణాలు అత్యంత కష్టంగా మారాయి. మరోవైపు పాలం విమానాశ్రయంలో ఎదురుగా కొద్ది మీటర్ల దూరంలో ఉన్న వస్తువులు కూడా కనిపించనంత దట్టంగా పొగ మంచు కమ్ముకుంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారత వాతావరణ శాఖ నివేదిక ప్రకారం ఇక్కడ రన్‌వేపై విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. దీంతో అత్యవసరంగా టేకాఫ్ కావాల్సిన విమానాల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. పలు జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇప్పటికే ఈ విమానాశ్రయానికి వస్తున్న పలు విమానాలను దారి మళ్లించారు. ప్రయాణికులు ఫ్లైట్ స్టేటస్‌ను తరచూ చెక్ చేసుకోవాలని స్పైస్ జెట్ కోరింది. పొగమంచు వల్ల తమ సేవలపై ప్రభావం పడుతోందని వెల్లడించింది.

**జేఎన్.1తో భయం లేదు** : దిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల్లోని వివిధ ఎయిర్ పోర్టుల్లో కూడా విజిబిలిటీ 0 మీటర్లకు పడిపోయినట్లు వాతావరణ శాఖ తెలిపింది. అమృత్‌సర్, ప్రయాగ్‌రాజ్, జైసల్మేర్, ఆగ్రా, గ్వాలియర్ విమానాశ్రయాల్లో ఈ పరిస్థితి నెలకొంది. సఫ్దార్‌గంజ్‌లో 200 మీటర్లు, షిల్లాంగ్ విమానాశ్రయంలో 300 మీటర్ల విజిబిలిటీ ఉంది. ఇక హైదరాబాద్ విమానాశ్రయానికి వస్తున్న కొన్ని విమానాలను కూడా తక్కువ విజిబిలిటీ కారణంగా దారి మళ్లించారు. దట్టమైన పొగమంచు కారణంగా సోమవారం ఉదయం 6 గంటలకు దిగాల్సిన బెంగళూరు, ముంబయి విమాన సర్వీసుల ల్యాండింగ్‌కు ఏటీసీ అధికారులు అనుమతించలేదు. మరో మూడు విమాన సర్వీసులను గన్నవరం మళ్లించారు. దిల్లీలో చలితీవ్రత పెరగడంతో నిరాశ్రయులు షెల్టర్లలో తలదాచుకోవాలని అధికారులు సూచించారు. ఆర్కేపురం, మునిర్కా, లోధి రోడ్, రింగ్ రోడ్, ఎయిమ్స్ వద్ద దట్టమైన పొగమంచు కురిసింది. ఇక రాజధానిలో గాలి నాణ్యత అత్యంత దారుణంగా ఉంది. సెంట్రల్ పొల్యూషన్ బోర్డ్ ఏక్యూఐ సూచీ 400 పాయింట్లుగా నమోదైంది.




నిడమనూరు: నల్గొండ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురితోపాటు మరో వ్యక్తి మృతి చెందాడు. పెద్దవూర మండలం నిమ్మానాయక్ తండాకు చెందిన కేశవులు(28) అనే యువకుడు ఆదివారం రాత్రి బైక్‌పై మిర్యాలగూడ నుంచి పెద్దవూర వెళ్తూ.. సైదులు (55) అనే పాదచారిని ఢీ కొట్టాడు. నిడమనూరులోని వేంపాడు సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న కేశవులు కుటుంబ సభ్యులు ఏడుగురు సోమవారం తెల్లవారుజామున టాటా ఏస్ వాహనంలో ఘటనాస్థలికి బయల్దేరి వెళ్లారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ప్రమాదస్థలికి అర కిలోమీటరు దూరంలో ఓ ఆయిల్ ట్యాంకర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రమావత్ గన్యా (40), నాగరాజు(28), పాండ్య(40), బుజ్జి(38) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హాలియా సీఐ గాంధీనాయక్, నిడమనూరు ఎస్సై గోపాల్‌రావు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

## వైకుంఠ దర్శనం: పోటెత్తిన భక్తులతో తిరుమల కిటకిట



తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి. నేడు(సోమవారం) త్రయోదశి శ్రీవారి దర్శనం కోసం భక్తులు కిటకిటలడుతున్నారు. వరుసగా సెలవులు నేపథ్యంలో దర్శనానికి భక్తులు బారులు తీరారు. త్రయోదశి సందర్భంగా ప్రముఖులు శ్రీవారి దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు జడ్జి కృపాసాగర్, సుప్రీంకోర్టు జడ్జ్ నాగరత్నం, హైకోర్టు జడ్జ్ కే సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే రోహిత్, టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శ్రీవారిని దర్శించుకున్నారు. వైకుంఠ ద్వాదశి నాడు(ఆదివారం) శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 63,519. నిన్న తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య 26,424. ద్వాదశి నాడు శ్రీవారి హుండీ ఆదాయం 5.05 కోట్లు వచ్చింది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రెండు రొజుల్లో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు 131,425. ఏకాదశి, ద్వాదశి రెండు రోజుల్లో హుండీ ఆదాయం 7.55 కోట్లు వచ్చింది. తిరుపతిలో కేటాయిస్తున్న ఉచిత వైకుంఠ ద్వార దర్శన టికెట్లు పూర్తి అయ్యాయి. 53 గంటల్లో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) 4,23,500 టికెట్లు జారీ చేసింది.

**ముగిసిన వైకుంఠద్వార దర్శనం టోకెన్ల కోటా :** ఈనెల 22 రాత్రి 11:30 నుంచి టోకెన్లు జారీ చేసిన టీటీడీ 4.25 లక్షల భక్తులకు వైకుంఠద్వార దర్శన టోకెన్లు జారీ చేసింది. టైమ్ స్లాట్, టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే దర్శనం కల్పిస్తున్నట్లు టీటీడీ పేర్కొంది. రోజూ 65 వేల మందికి పైగా భక్తులకు వైకుంఠద్వార దర్శనం చేసుకుంటున్నారు. ఈనెల 23 నుంచి జనవరి 1 వరకు వైకుంఠ ద్వార భక్తులు దర్శనం చేసుకోవచ్చు. నంద్యాల(శ్రీశైలం): శ్రీశైలం మల్లన్న ఆలయంలో రెండోవరోజు భక్తుల రద్దీ కొనసాగుతోంది. వరుసగా సెలవులు వచ్చిన నేపథ్యంలో స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవారి దర్శనానికి సుమారు 5 గంటల సమయం పడుతోంది. భక్తుల రద్దీతో క్షేత్రమంత భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది.

## బీజేపీ ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంది



బాపట్ల: బీజేపీ ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. సోమవారం నాడు బీజేపీ కార్యాలయంలో పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ..."ఏపీలోని గ్రామల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తుంది. బీజేపీ అభివృద్ధి నిరోధకంగా పనిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తుంది. గ్రామ సడక్ యోజన వంటి గొప్ప పథకాన్ని ప్రవేశపెట్టిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి. సమాజంలోని అట్టడుగు ప్రజలకు సంక్షేమం అందించడమే బీజేపీ లక్ష్యం. కేంద్ర నిధులు గ్రామాలకు చేరకపోతే ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. ఏపీ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో కేంద్రం ఇచ్చిన నిధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నాం" అని దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు.

## జగన్ ఇక జన్మలో ముఖ్యమంత్రి కాలేరు: మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి



కడప: జగన్‌ను గెలిపించి మనం తప్పు చేశామని నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కడపలో నిర్వహించిన మాజీ మంత్రి వీరారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "నేను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచా. అయినా నా గ్రాఫ్ బాగా లేదంటూ సీఎం జగన్ నన్ను కించపరిచారు. పార్టీ బలోపేతం కోసం ఎంతో శ్రమించా.

లేనిపోని అనుమనాలతో నా టికెట్‌నే అమ్మకానికి పెట్టారు. అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశారు. జగన్ ఇక జన్మలో ముఖ్యమంత్రి కాలేరు. జగన్ లాంటి వారు రాష్ట్రాన్ని పాలిస్తే ప్రజలు బాగుపడరు. రుషికొండలో భవనాలను సరదాగా కట్టుకున్నట్లు ఉంది. సీఎం పదవి భగవంతుడు ఇచ్చిన వరమని జగన్ గ్రహించాలి" అని హితవు పలికారు.

## రత్తాలు ముత్యాలు పూల్‌సైడ్ రచ్చ

ఇంతకీ ఎవరీ రత్తాలు – ముత్యాలు..? స్విమ్ సూట్లతో రచ్చ రంబోళా చేస్తున్నారు. వీళ్లెవరో కనిపెట్టారా? రత్తాలు సింగారానికి, ముత్యాలు హొయలుకి ఫిదా అయిపోవాల్సిందే. ఎందులోనూ తగ్గేదేలే అంటున్న ఈ భామలు రకుల్ ప్రీత్– ప్రగ్య జైశ్వాల్. వీలు కుదిరినప్పుడల్లా ముంబై రెస్టారెంట్లు, పబ్లిక్ వేదికలపై ఈ జోడీ బోలెడంత రచ్చ చేస్తున్నారు. ఆ ఇద్దరూ ముంబైలో ఉన్నప్పుడు సాయంత్రాల మీటింగులు, సినిమాల గురించిన కబుర్లు చెప్పుకుంటారు. రెస్టారెంట్లు, బాలీవుడ్ ఈవెంట్లకు వెళుతుంటారు. కొన్నేళ్లుగా ఆ ఇద్దరూ ముంబై ఈవెంట్లలో సందడి చేస్తూ మీడియా కంటికి చిక్కుతున్నారు. ముఖ్యంగా ఆ ఇద్దరి స్నేహం గురించి ముంబై పరిశ్రమలో బోలెడంత చర్చ సాగుతోంది. ఏది ఏమైనా కానీ రత్తాలు



ముత్యాలు తరహాలో ఈ జంట స్నేహం అందరిలో స్ఫూర్తి నింపుతోంది. అటు హిందీ పరిశ్రమ, ఇటు తెలుగు పరిశ్రమలో అవకాశాలు ఎలా అందిపుచ్చుకోవాలో తెలియక ఈ భామలిద్దరూ ఇటీవల సతమతమవుతున్నారు. రకుల్ ఇప్పటివరకూ తన హిందీ నిర్మాత కం బోయ్ ఫ్రెండ్ సాయంతో తన మనుగడను సాగిస్తోంది. త్వరలోనే అతడిని పెళ్లాడుతుందని భావిస్తున్నా ఇప్పట్లో ఆ ప్రకటన ఉండేట్టు లేదు. ప్రగ్య ప్రస్తుతం ఎఫైర్లతో సంబంధం లేకుండా కెరీర్ బండిని సాగిస్తోంది. ఒక చిన్న పూల్ పార్టీ ఎవరి హృదయాలను గాయపరచకుండా.. అంటూ ఈ అందమైన ఫోటోషూట్ ని షేర్ చేయగా అది వైరల్ గా మారుతోంది. రకుల్– ప్రగ్యతో పాటు, పూల్ సైడ్ పార్టీలో నేహా శెట్టి, మంచు లక్ష్మీ, నంబియార్, సౌమ్య తదితరులు ఉన్నారు. ఇందులో రకుల్– ప్రగ్య సపరేట్గా ఉన్న స్పెషల్ ఫోటోగ్రాఫ్ అంతర్జాలం లో వైరల్ గా మారుతోంది. హృదయాలను గాయపరచకుండా లేదా దొంగిలించకుండా ఏదీ ఉండదని ఈ ఫోటో చూసాక మనం అర్థం చేసుకోవాలి. ఈ ఇద్దరికీ పాపులర్ జువెలరీ బ్రాండ్.. పాపులర్ డిజైనర్ దుస్తుల బ్రాండ్, ఫుట్ వేర్ బ్రాండ్ ప్రమోషన్ ని అందిస్తున్నాయి.

## వైట్ డ్రెస్ లో అందాలు రాశి

ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఈ అమ్మడు కెరీర్ ఆరంభం నుంచే నటిగా మరియు అందంతో అలరిస్తూ వస్తోంది. మొదటి సినిమా తో పోల్చితే ఆ తర్వాత సినిమాల్లో మరింత అందంగా నాజూకుగా కనిపించింది. టైర్ 2 హీరోలకు జోడీగా నటిస్తూ చాలా ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న ఈ అమ్మడు ప్రస్తుతం తమిళంలో బిజీ అయ్యింది. తెలుగులో ఒకటి రెండు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లు సమాచారం అందుతోంది.



త్వరలోనే కొత్త తెలుగు సినిమా కు ఈమె ఓకే చెప్పే అవకాశాలు ఉన్నాయి. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా తన అందాల ఫోటో షూట్స్ ను షేర్ చేస్తూ ఉండే రాశి ఖన్నా తాజాగా మరోసారి ఇలా వైట్ డ్రెస్ లో అందాల విందు చేసిన ఫోటోలను షేర్ చేసింది. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేసిన ఫోటోలు గతంలో ఈమె షేర్ చేసినా కూడా ఈ ఫోటోలు అంతకు మించి అన్నట్లుగా ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడికి ఉన్న ఫాలోయింగ్ కు తగ్గట్లుగా అందాల ఆరబోత పెంచుతూనే ఉంది. ఇంత అందంగా ఉన్న అందాల రాశిని ఎందుకు స్టార్ హీరోలు లైట్ తీసుకున్నారో అర్థం అవ్వడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.





## ఎన్టీఆర్ 31 కూడా అదే రూట్లో..




సలార్2 రిలీజ్ తర్వాత ప్రశాంత్ నీల్ జూనియర్ ఎన్టీఆర్ తో సినిమాని స్టార్ట్ చేయనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ కన్ఫర్మ్ అయ్యింది. ఎన్టీఆర్ 31 వర్కింగ్ టైటిల్ తో ఎనౌన్స్ చేశారు. ఈ సినిమా మైథలాజికల్ టచ్ తో యాక్షన్ బ్యాక్ డ్రాప్ ఫిక్షనల్ కథాంశంతోనే ఉంటుందని ఒక ప్రచారం నడుస్తోంది. భారీ బడ్జెట్ తో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన సలార్ పార్ట్ 1 రిలీజ్ కాబోతోంది. దీని తర్వాత వీలైనంత వేగంగా సలార్2ని కూడా ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. సలార్ నుంచి కంప్లీట్ గా బయటకొచ్చిన వెంటనే ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్ మూవీ స్క్రిప్ట్ వర్క్ స్టార్ట్ చేస్తారంట. వచ్చే ఏడాదిలోనే ఈ సినిమా సెట్స్ పైకి వెళ్ళే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ సినిమా గురించి ఇంటరెస్టింగ్ టాక్ బయటకొచ్చింది. కేజీఎఫ్ సిరీస్, సలార్ సిరీస్ తరహాలోనే ఎన్టీఆర్ 31 మూవీ కూడా రెండు భాగాలుగానే తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే స్టోరీ ఐడియా సిద్ధంగా ఉందని కచ్చితంగా ఎన్టీఆర్ కెరియర్ లో బెస్ట్ మూవీలో ఒకటిగా ఈ చిత్రం నిలిచిపోతుందని ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోన్న మాట. మైత్రీ మూవీ మేకర్స్ కూడా ఈ సినిమా కోసం భారీగా ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారంట. ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ నుంచి అత్యధిక బడ్జెట్ తో పుష్ప 2 మూవీ తెరకెక్కుతోంది. దీనికంటే ఎక్కువ బడ్జెట్ ఎన్టీఆర్ 31 మూవీ కోసం పెట్టబోతున్నట్లు ప్రచారం నడుస్తోంది. నందమూరి అభిమానులు కూడా ఈ మూవీ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం తారక్ కొరటాల శివతో దేవర మూవీ చేస్తున్నారు. ఈ సినిమా కూడా రెండు భాగాలుగానే తెరకెక్కుతోంది. దీని తర్వాత వార్ 2 ఉంటుంది. అది కంప్లీట్ చేసిన అనంతరం ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ కోసం సిద్ధమయ్యే ఛాన్స్ ఉందని టాక్. మరి ఈ మూవీని ఎప్పుడు స్టార్ట్ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.

## సందీప్ కిషన్ భైరవ కోన.. గెట్ రెడీ!




సందీప్ కిషన్ హీరోగా విఐ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఊరుపేరు భైరవకోన మూవీ రిలీజ్ డేట్ ఎట్టకేలకు ఖరారు అయ్యింది. సందీప్ కిషన్ కెరియర్ లో భారీ బడ్జెట్ తో సూపర్ న్యాచురల్ కాన్సెప్ట్ తో థ్రిల్లర్ జోనర్ లో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఏకే ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రాజేష్ దండా ఈ మూవీకి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ లో జరుగుతోందని చిత్ర యూనిట్ క్లారిటీ ఇచ్చింది. ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ ప్రస్తుతం జరుగుతుందంట. తాజాగా రిలీజ్ డేట్ ని ఎనౌన్స్ చేశారు. ఫిబ్రవరి 9న ఈ మూవీని గ్రాండ్ గా రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే అవుట్ ఫుట్ సిద్ధం కావడంతో ప్రమోషనల్ యాక్టివిటీస్ మొదలు పెట్టబోతున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. మైఖేల్ మూవీ తర్వాత సందీప్ కిషన్ నుంచి రాబోతున్న సినిమా ఇదే కావడం విశేషం. తెలుగు, తమిళ్ భాషలలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. వర్ష బొల్లమ్మ, కావ్యా థాపర్ చిత్రంలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. డిఫరెంట్ కంటెంట్ తో వస్తోన్న సినిమా కావడంతో దీనిపై సందీప్ కిషన్ చాలా హోప్స్ పెట్టుకున్నారు. విఐ ఆనంద్ దర్శకత్వంలో సందీప్ కిషన్ ఇప్పటికే టైగర్ అనే మూవీ చేశారు. ఈ సినిమా హిట్ టాక్ సొంతం చేసుకుంది. మరో సారి విఐ ఆనంద్ సందీప్ కిషన్ ని డిఫరెంట్ క్యారెక్టర్ లో చూపించే ప్రయత్నం చేస్తున్నారు. మరి ఈ మూవీ అతనికి ఎలాంటి సక్సెస్ ని అందిస్తుంది అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

సామజవరగమన లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత రాజేష్ దండా నుంచి ఈ మూవీ వస్తోంది. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ లో ఈ చిత్రాన్ని విఐ ఆనంద్ సిల్వర్ స్క్రీన్ పై ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమాకి శేఖర్ చంద్ర మ్యూజిక్ అందిస్తున్నారు. విఐ ఆనంద్ డిస్కో రాజా సినిమా తర్వాత మూడేళ్ళ గ్యాప్ తీసుకొని ఊరు పేరు భైరవకోన సినిమా చేస్తూ ఉండటం విశేషం.

## సమంత బ్రాండ్ వాల్యూ ఎంత అంటే !

సమంత సినిమాలు చేయకుండా ఏడాది పాటు బ్రేక్ తీసుకున్నా కూడా రెగ్యులర్ గా వార్తల్లో నిలుస్తూనే ఉంది. ఆమె గురించిన ఏదో ఒక విషయం సోషల్ మీడియా ద్వారా, మెయిన్ స్ట్రీమ్ మీడియా ద్వారా చర్చ జరుగుతూనే ఉంది. ఇప్పుడు సమంత బ్రాండ్ వ్యాల్యూ గురించిన ఆసక్తికర చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది. సమంతకి పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపు ఉంది. సౌత్ లో హీరోయిన్ గా కెరీర్ ను ఆరంభించిన సమంత వెబ్ సిరీస్ తో పాటు కొన్ని డబ్బింగ్ సినిమాల ద్వారా ఉత్తర భారతంలో కూడా భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ను క్రియేట్ చేసుకుంది. దానికి తోడు సమంత ఇన్ స్టాలో దాదాపుగా 30 మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. సమంతతో ఒక్క యాడ్ చేస్తే పాన్ ఇండియా రేంజ్ లో మంచి రీచ్ వస్తుంది. అంతే కాకుండా ఆమె సోషల్ మీడియా ద్వారా కూడా తమ ఉత్పత్తులను ప్రచారం చేస్తుంది. సోషల్ మీడియా మరియు మెయిన్ స్ట్రీమ్ మీడియా, ప్రింట్ మీడియా ఇలా అన్ని రకాలుగా దేశ వ్యాప్తంగా సమంత బ్రాండ్ అంబాసిడర్ గా చేసే ఉత్పత్తులకు ప్రచారం దక్కుతుంది. సమంతకు ఉన్న ఫాలోయింగ్ మరియు ఆమె బ్రాండ్ అంబాసిడర్ గా చేస్తే వచ్చే రీచ్ ను బేరీజు వేసుకుని ఆమెకు ఏకంగా



కోటి.. అంతకు మించి పారితోషికం ఇచ్చేందుకు కంపెనీలు ముందుకు వస్తున్నాయట. స్టార్ హీరోల స్థాయిలో సమంత బ్రాండ్ అంబాసిడర్ గా డబ్బు సంపాదిస్తుందని మార్కెట్ వర్గాల వారు అంటున్నారు. ఏడాదికి నాలుగు అయిదు కొత్త బ్రాండ్స్ కు సమంత అంబాసిడర్ గా వ్యవహరిస్తుంది. దాంతో ఆమె సినిమాలు చేసినా చేయకున్నా కూడా భారీగా ఆమె కు ఆదాయం నమోదు అవుతుంది. అంతే కాకుండా ఆమె ఇన్ స్టా ద్వారా కూడా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదిస్తుందని సమాచారం మొత్తానికి సమంత బ్రాండ్ వ్యాల్యూ బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ రేంజ్ లో ఉంది అనడంలో సందేహం లేదు. ఇక సమంత సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం బ్రేక్ లో ఉన్న సమంత అతి త్వరలోనే మళ్లీ షూటింగ్ కు హాజరు అవ్వబోతుంది. ఇక ఆమె నటించిన సిటాడెల్ హిందీ వెబ్ సిరీస్ వచ్చే ఏడాది సమ్మర్ లో విడుదల అవ్వబోతుంది. ఇక ది ఫ్యామిలీ మ్యాన్ కొత్త సిరీస్ కి కూడా సమంత ఓకే చెప్పిందని వార్తలు వస్తున్నాయి. హిందీలో వరుసగా సమంత సినిమాలు చేస్తుందని టాక్ వినిపిస్తుంది.

## మాట మీద నిలబడ్డ వర్మ.. 'శారీ' అందం రాబోతుంది

వివాదాల దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఈ మధ్య కాలంలో ఎన్నో సినిమాలను ప్రకటించాడు. అందులో కొన్ని తాను చేస్తే, కొన్ని సినిమాలను ఇతర దర్శక నిర్మాతలకు అప్పగించి పూర్తి చేసిన విషయం తెల్సిందే. ఇప్పుడు శారీ అనే సినిమాను వర్మ ప్రకటించి అందరి దృష్టిని ఆకర్షించాడు. కొన్ని నెలల క్రితం రామ్ గోపాల్ వర్మ చీర కట్టుకుని చాలా అందంగా ఫోటోలకు ఫోజ్ ఇస్తూ ఉన్న ఒక అమ్మాయి వీడియోను షేర్ చేశాడు. ఈమె ఎవరో నాకు తెలియజేయండి అంటూ సోషల్ మీడియా ద్వారా పోస్ట్ పెట్టాడు. ఆ పోస్ట్ కు విపరీతమైన స్పందన వచ్చింది. ఆ చీర కట్టుకున్న యువతి మలయాళ ఇండస్ట్రీకి చెందిన శ్రీలక్ష్మి సతీష్ అని తేలింది. ఆమె తో వర్మ గతంలోనే సినిమాను తీస్తానంటూ ప్రకటించాడు. అయితే వర్మ అలా ఎన్నో సినిమాలు ప్రకటిస్తాడు.. కానీ అందులో ఎంత వరకు సినిమా లు పూర్తి చేస్తాడో క్లారిటీ లేదు. కనుక ప్రస్తుతం పొలిటికల్ డ్రామా వ్యూహం పై దృష్టి పెట్టిన వర్మ శారీ ని మరచి పోయాడేమో అనుకున్నారు. కానీ తాజాగా




శారీని మొదలు పెడతాను అంటూ ప్రకటించాడు. గతంలో శ్రీలక్ష్మి సతీష్ కు ఇచ్చిన మాట ప్రకారం శారీ అనే టైటిల్ తో సినిమాను రూపొందించబోతున్నట్లుగా ఒక పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. ఆ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చీర కట్టు లో హీరోయిన్స్ ను అభిమానించే వారు అంతా కూడా వర్మ రూపొందించబోతున్న శారీ సినిమా కోసం వెయిట్ చేస్తున్నామంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఒక వైపు వ్యూహం ను రెండు పార్ట్ లుగా చేస్తానంటూ ప్రకటించి మొదటి పార్ట్ ని రిలీజ్ కి సిద్ధం చేసిన వర్మ ఇప్పుడు శారీ ని తానే స్వయంగా రూపొందిస్తాడా లేదంటే ఎవరి చేతిలో అయినా పెడుతాడా అనేది చూడాలి.




హైదరాబాద్: మంగళవారం ( రేపు ) ఢిల్లీకి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వెళ్లనున్నారు. ఈ మేరకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లనున్నట్లు తెలుస్తోంది. రేపు సాయంత్రం 4 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్టానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.
ఈ భేటీ అనంతరం ఏఐసీసీ అగ్రనేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో టీపీసీసీ చర్చలు, పార్లమెంట్ ఎన్నికలపై చర్చించనున్నట్లు సమాచారం.




భద్రాద్రి: సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కార్మికుల వైద్యానికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. భద్రాద్రి జిల్లా ఇల్లందు, కొత్తగూడెంలో నిర్వహించిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ఖర్చు లేకుండా కారుణ్య నియామకాలు చేపడతామని చెప్పారు.

కార్మికులకు ఇంటిస్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. "సింగరేణి దినోత్సవం రోజున సెలవుగా ప్రకటిస్తాం. మహిళా కార్మికులకు గని లోపల కాకుండా ఉపరితలంలో పని చేసే అవకాశం కల్పిస్తాం. కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరిస్తాం" అని పొంగులేటి హామీ ఇచ్చారు.

సింగరేణి కార్మికుల సొంతింటి కలను నిజం చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ తరఫున ఆయన ప్రచారం నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ వేస్తామని, ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాన్ని గెలిపించాలని శ్రీధర్ బాబు కోరారు.

# 'సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల నిజం చేస్తాం'

పెద్దపల్లి: ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఐఎన్టీయూసీ) కార్మిక సంఘాన్ని గెలిపించాలని సింగరేణి కార్మికులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరారు. సోమవారం సింగరేణి ఎన్నికల ప్రచారంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. సింగరేణి ఆర్జీ 3 పరిధిలోని ఏఎల్‌పీ, ఓసీపీ 1, ఓసీపీ 2 బొగ్గుగనుల్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టీయూసీ తరుపున మంత్రి శ్రీధర్ బాబు ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మట్లాడారు. సింగరేణి కార్మికుల సొంత ఇంటి కలను నిజం చేస్తామని తెలపారు.



నూతన అండర్ గ్రౌండ్ బొగ్గుగనులను ఏర్పాటు చేస్తామన్నారు. డిపెండెంట్ కార్మికులకు డబ్బులు ఖర్చు కాకుండా ఉద్యోగాలు వచ్చే విధంగా కృషి చేస్తామని చెప్పారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిస్కారానికి హైపవర్ కమిటీ నియమిస్తామని శ్రీధర్‌బాబు తెలిపారు.

# కోవిడ్‌తో జాగ్రత్త అవసరం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: కరోనా కొత్త వేరియంట్ కారణంగా దేశంలో పాజిటివ్ కేసుల సంఖ్యల పెరుగుతోంది. దాదాపు 700లకుపైగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కరోనాతో మరణాలు కూడా నమోదు అవుతున్నాయి. ఇక, తెలంగాణలో కూడా కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. పదుల సంఖ్యలో పాజిటివ్ కేసులు ఉన్నట్టు వైద్యారోగ్యశాఖ బులిటెన్‌లో పేర్కొంది. అయితే, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సోమవారం తిలక్‌నగర్‌లోని ఫీవర్ ఆసుపత్రికి వెళ్లారు. కోవిడ్‌పై ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'కోవిడ్ వ్యాప్తిపై రాష్ట్రాలను అప్రమత్తం చేశాం. అవసరమైతే కోవిడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తాం. కొత్త వేరియంట్ వ్యాప్తి వేగంగా ఉంటుందని, ప్రమాదకరంకాదని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు. కోవిడ్ కట్టడికి ప్రజలు కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. ఆసుపత్రుల్లో ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని అన్నారు.

# రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హుజూర్‌నగర్: రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే చౌక బియ్యం రీసైక్లింగ్‌కు పాల్పడితే ఎంతటి వారు అయినా కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని ఓ రేషన్ దుకాణాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. పేదలకు అందించే బియ్యానికి ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తుందన్నారు. ఈ బియ్యాన్ని కొందరు గత ప్రభుత్వంలోని నాయకులు, అధికారుల అండదండలతో రీసైక్లింగ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రేషన్ మాఫియా ఆగడాలపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. "2014లో భారాస అధికారంలోకి వచ్చినప్పుడు సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అప్పు రూ.3,300 కోట్లు. ప్రస్తుతం వడ్డీ భారమే ఏడాదికి రూ.3,000 కోట్లు ఉంది. గత ప్రభుత్వం ఈ శాఖని నిర్లక్ష్యం చేయడంతో కార్పొరేషన్‌కు రూ.11 వేల కోట్ల నష్టం వాటిల్లింది. భారీగా బియ్యం నిల్వలు ఉంచుకోవడానికి రాష్ట్రంలో స్థలం లేదు. బియ్యం నిల్వలను కొనుగోలు చేసేందుకు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు ముందుకొచ్చినా.. గత ప్రభుత్వం విక్రయించకుండా గోదాముల్లోనే ఉంచి పాడవడానికి కారణమైంది. ఆ రాష్ట్రాలకు బియ్యం విక్రయాలను పరిశీలిస్తున్నాం. కార్పొరేషన్‌ను ప్రమాదకర స్థితి నుంచి రక్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం" అని మంత్రి ఉత్తమ్ వివరించారు.



# రైతులపై కర్ణాటక మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు.. తీవ్రంగా ఖండించిన భాజపా

బెంగళూరు: రైతులపై కర్ణాటక మంత్రి శివానంద పాటిల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బెళగావిలో జరిగిన ఓ సమావేశంలో ఆయన రైతు రుణ మాఫీల గురించి ప్రస్తావించారు. తమ రుణాలను ప్రభుత్వం మాఫీ చేసేందుకు రైతులు ఏటా కరవును కోరుకుంటున్నారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రతిపక్ష భాజపా తీవ్రంగా మండిపడింది. "రైతులకు కరెంట్, నీరు ఉచితంగా లభిస్తున్నాయి. ఎంతో మంది ముఖ్యమంత్రులు రాష్ట్రంలో వ్యవసాయరంగ విస్తరణకు సహకారం అందించారు. అయితే ఏటా కరవు రావాలని రైతులు కోరుకుంటున్నారు. ఎందుకంటే దీని వల్ల ప్రభుత్వం వారి రుణాలను మాఫీ చేస్తుందని భావిస్తున్నారు. కానీ, మీరు అలా కోరుకోవడం సరికాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ప్రస్తుతం మంత్రి వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో వివాదాస్పదంగా మారాయి. రైతులను అవహేళన చేస్తూ శివానంద మాట్లాడడంపై భాజపా మండిపడింది. పాటిల్‌ను మంత్రి వర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసింది. సీఎం సిద్ధరామయ్య కేబినెట్ అంతా అజ్ఞానులతో నిండిపోయిందని విమర్శించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అవమానించిందని.. ఈ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకమని దుయ్యబట్టింది. సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. మంత్రి శివానంద పాటిల్ గతంలోనూ రైతుల ఆత్మహత్యలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలకు అందించే నష్టపరిహారాన్ని ప్రభుత్వం పెంచిన తర్వాత రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వం నుంచి పరిహారాన్ని కోరడంలో తప్పు లేదు. కానీ మరికొన్ని సందర్భాల్లో ఆర్థిక సహాయం కోసం వ్యక్తుల సహజ మరణాలను కూడా ఆత్మహత్యలుగా చూపిస్తున్నారు" అని ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఆ తర్వాత పాటిల్ స్పందిస్తూ.. తాను చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు.




హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నగరంలో 'సన్‌బర్న్' పేరిట నిర్వహించ తలపెట్టిన ఈవెంట్‌పై దుమారం రేగడంతో సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతిస్పందించారు. ఈవెంట్ నిర్వహణకు దరఖాస్తు చేసుకున్నారని, అయితే అనుమతి ఇవ్వలేదని ఆయన తెలిపారు.

మాదాపూర్‌లోని హైటెక్‌సిటీ సమీపంలో ఈ ఈవెంట్ ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. ఇది ఇతర నగరాల్లో జరిగే సన్‌బర్న్‌లాంటి వేడుక కాదని, అందుకే అనుమతి నిరాకరించామని మహంతి వెల్లడించారు. మరోవైపు ఈవెంట్‌కు సైబరాబాద్ పోలీసులు అనుమతి ఇవ్వకున్నా ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆదివారం జరిగిన కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ఈవెంట్‌కు అనుమతి ఎవరిచ్చారని ప్రశ్నించడం, ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు ఎలా ప్రారంభించారని ప్రశ్నించినట్లు తెలిసింది. ఆ వెంటనే సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులు ఈవెంట్ నిర్వాహకుల్ని, బుక్ మై షో ప్రతినిధుల్ని పిలిపించుకొని గట్టిగా మందలించారు. హద్దు మీరితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలుస్తోంది.

# మానసిక వికలాంగుల పట్ల దుర్మార్గంగా ప్రవర్తించొద్దు

సిద్దిపేట: కొందరు మానసిక వికలాంగుల పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తారని.. అది మంచి పద్ధతి కాదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సోమవారం నాడు జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో అభయ జ్యోతి మనో వికాస కేంద్రం ఆధ్వర్యంలో సోలార్ సిస్టమ్, మానసిక వికలాంగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే హరీష్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "మానసిక వికలాంగులకు ఉచిత కంప్యూటర్, సోలార్‌ను ప్రారంభించాం.

మానసిక వికలాంగులకు అభయ జ్యోతి ఎంతగానో ఉపయోగ పడుతుంది. మానసిక వికలాంగులు వయస్సులో ఎంత పెద్దవాళ్లు అయిన చిన్న పిల్లలతో సమానం. దేశంలో, ఏ రాష్ట్రంలో అయిన 400, 700 కంటే ఎక్కువ పెన్షన్ ఇవ్వలేదు. గతం కేసీఆర్ ప్రభుత్వం వికలాంగులకు నాలుగు వేల పెన్షన్ ఇచ్చింది. నాలుగు వేల పెన్షన్‌ను, ఆరు వేలు ఇస్తామని చెప్పారని.. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెన్షన్‌ను ఆరు వేల రూపాయలను పెంచి ఇవ్వాలి. మానసిక వికలాంగులకు అవసరాల కోసం నా జీతం నుంచి కొంత డబ్బులు ఇస్తాను" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



# కాంగ్రెస్ డీఎన్‌ఏలో హిందూ వ్యతిరేక ధోరణి



హైదరాబాద్: కాంగ్రెస్ డీఎన్‌ఏలో హిందూ వ్యతిరేక ధోరణి ఉందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. సోమవారం నాడు తెలంగాణ భవన్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ...."సనాతన ధర్మాన్ని అవమానించినప్పుడు ఏఐసీపీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు స్పందించలేదు. డీఎంకే నేతలు దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా మాట్లాడుతుంటే కాంగ్రెస్ ఎందుకు అదుపు చేయడం లేదు. ఇండియా కూటమిలో ఉన్న డీఎంకే నేతల వ్యాఖ్యలపై కాంగ్రెస్ వైఖరి ఏమిటో రాహుల్ గాంధీ చెప్పాలి. హిజాబ్ వివాదంపై కూడా రాహుల్ గాంధీ వైఖరిని వెల్లడించాలి. కాంగ్రెస్ అంటేనే మోసం, కుట్ర, మభ్యపెట్టడం. తెలంగాణలో హామీల అమలుకు మరికొంత సమయం ఇస్తాం. తగిన సమయంలోగా హామీలు అమలు చేయకపోతే కచ్చితంగా పోరాటం చేస్తాం. బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని ఆరు నెలల నుంచి కాంగ్రెస్, బీజేపీ అసత్య ప్రచారం చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెడతాం" అని కవిత పేర్కొన్నారు.

**అబిడ్స్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కవిత :** భాగ్యనగరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవుల చర్చిలు సందడిగా మారాయి. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా అబిడ్స్‌లోని సెంటీనరీ మెథడిస్ట్ చర్చిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మదిన వేడుకల సందర్భంగా పాస్టర్‌లు, క్రైస్తవ మతపెద్దలు, బిషప్?లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. రంగురంగుల దీపాలతో చర్చిలను అలంకరించారు. నూతన వస్త్రాల ధరించి పెద్దలు, చిన్నారులు చర్చిలకు వచ్చారు. ప్రభువు ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కవిత ఆకాంక్షించారు. ప్రపంచం మొత్తం ఎంతో ఘనంగా జరుపుకునే గొప్ప పండుగ క్రిస్మస్ అని కవిత కొనియాడారు.

# 6 గ్యారెంటీలను వందరోజుల్లోగా అమలు చేస్తాం

ఖమ్మం: 6 గ్యారెంటీలను వందరోజుల్లోగా అమలు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం నాడు ఖమ్మంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తుమ్మల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తుమ్మల మీడియాతో మాట్లాడుతూ... ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో సోనియాగాంధీ ఆశీస్సులతో సుపరిపాలన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. ప్రశాంతమైన ప్రగతిశీల ఖమ్మం అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో తన గెలుపుకు సహకరించిన వారికి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.



# నల్గొండలో రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి





నల్గొండ: నల్గొండ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నడమనూరు మండలం వెంపాడు స్టేజీ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ట్యాంకర్ అదుపు తప్పి.. టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదం ఆరుగురు మృతి చెందారు. ఆటోలో ఏడుగురు ప్రయనిస్తుండగా అందులోని నలుగురు అక్కడిక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తరలించిన ఇద్దరు కూడా మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు. మృతులు నిడమానూరు మండలం నిమానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లెవాని కుంట తండాకు చెందిన రమావత్ కేశవులు, గణ్, నాగరాజు, పాండ్య, బుజ్జిగా పోలీసులు గుర్తించారు.

# పెరిగిన మహిళా ప్రయాణికులు.. కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు

మణుగూరు(భద్రాద్రి కొత్తగూడెం): మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంలో మణుగూరు నుంచి పలు పట్టణాలకు వెళ్లే బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించడంతో బస్సుల్లో రద్దీ పెరిగింది. గతంతోప్రత్యేక సిబ్బందిని బస్టాండ్ వద్ద డిపో అధికారులు నియమించే వారు. వారు ప్రయాణికులను ఆర్టీసీ బస్సులో ఎక్కండంటూ ప్రచారా లను నిర్వహిస్తూ ఉండేవారు. ఎంత పిలిచినా వారు ఆర్టీసీ బస్సుల్లో ఎక్కేవారు కాదు. కానీ నేడు అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో పట్టణంలోని పలు బస్టాఫ్‌ల వద్ద బస్సులను ఎక్కేవారు. కానీ ఇప్పుడు సీట్లు దోరకడం లేదుకాబట్టి ప్రయాణికులు అంతా సురక్ష బస్టాండ్‌కు చేరుకుని ప్లాట్ ఫాంపై ఉన్న బస్సును ముందే ఎక్కి కూర్చుంటున్నారు. మహిళల సంఖ్య పెరిగిపోయే సరికి సీట్లు దొరకని పరిస్థితులు నెలకొంటున్నాయి.

**సమయ పాలన పాటించాలి :** మణుగూరు నుంచి భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసులు ఉదయం సకాలంలో రావడం లేదని మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు వాపోతున్నారు. బుధవారం గంటకు పైగా బస్టాండ్‌లో ఉన్నా బస్సులు సకాలంలో రాకపోవడంతో వారు ఇబ్బందిపడ్డారు. డిపో అధికారులు ఈ విషయంపై తగిన చర్యలను తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఉచిత ప్రయాణ పథకం వల్ల బస్సులను కుదించడం సరికాదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com